స్థాయికి మించి వైద్యం చేస్తే చర్యలు



దేవరకొండలో డివిజన్‌స్థాయి ప్రైవేట్ ఆసుపత్రుల నిర్వాహకులకు చట్టాలపై అవగాహన కల్పిస్తున్న డీఎంహెచ్‌వో శ్రీనివాస్

దేవరకొండ, న్యూస్‌టుడే: అర్హతలేని వారు స్థాయికి మించి వైద్యం చేస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయని, నిబంధనలు ఉల్లంఘిస్తే వారిపై కేసులు నమోదు చేస్తామని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ పుట్ల శ్రీనివాస్ హెచ్చరించారు.

❒ బుధవారం దేవరకొండ ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో డివిజన్‌స్థాయి ప్రైవేట్ ఆసుపత్రుల ల్యాబ్‌లు, క్లినిక్‌లు, ఎక్స్‌రే యాజమాన్యానికి వైద్య చట్టాలపై అవగాహన కల్పించారు. ప్రైవేట్ ఆసుపత్రుల వారు తప్పనిసరిగా నోటీస్ బోర్డ్ పైన వైద్యుల వివరాలతో పాటు ఫీజుల పట్టిక ఏర్పాటు చేయాలన్నారు.

❒ డిప్యూటీ డీఎంహెచ్‌వో కేస రవి, ప్రోగ్రాం అధికారి అరుంధతి, జిల్లా మాస్ మీడియా అధికారి తిరుపతిరెడ్డి, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు దూదిపాల వేణుధర్‌రెడ్డి, రవి, రమేష్ తదితరులున్నారు.

28న జాతీయ మెగా లోక్ అదాలత్

నల్గొండ లీగల్, న్యూస్‌టుడే: రాజీ మార్గమే రాజమార్గంగా నిర్వహిస్తున్న లోక్ అదాలత్‌ను జయప్రదం చేయాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బండి దీప్తి బుధవారం తెలిపారు. ఈ నెల 28న జాతీయ, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థల ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా మెగా లోక్ అదాలత్‌ను నిర్వహించనున్నట్లు న్యాయమూర్తి చెప్పారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి నాగరాజు పర్యవేక్షణలో ఇప్పటికే అన్ని కోర్టు పరిధిలో న్యాయమూర్తులతో కూడిన బెంచీలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ లోక్ అదాలత్‌లో రాజీ పడే సివిల్, క్రిమినల్ కేసులు, మోటారు వాహన ప్రమాద కేసులు, చెక్ బౌన్స్ కేసులు, భూ వివాదాలు తదితర కేసులను పరిష్కరిస్తామని, ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. ఈ నెల 28 ఉదయం 10 గంటలకు జాతీయ లోక్ అదాలత్‌ను జిల్లా ప్రధాన న్యాయమూర్తి నాగరాజు జిల్లా కోర్టులో ప్రారంభిస్తారని న్యాయమూర్తి చెప్పారు.

బస్సు కావాలి..!



మిర్యాలగూడ ఆర్టీసీ బస్టాండ్

మిర్యాలగూడ నుంచి హైదరాబాద్ మార్గంలో మధ్యాహ్నం 1.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు ఎక్స్‌ప్రెస్ బస్సులు లేవు. దీంతో మహిళా ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు.

నల్గొండ నుంచి హైదరాబాదకు సైతం ఎక్స్‌ప్రెస్ బస్సులు తక్కువగా ఉండటంతో.. కోదాడ నుంచి వచ్చే బస్సుల కోసం మహిళలు గంటల తరబడి వేచి చూడాల్సి వస్తోంది.

మునుగోడు నియోజకవర్గానికి ఆర్టీసీ బస్సు రవాణాను పెంచేందుకు 21 మార్గాల్లో బస్సులు నడపాలని స్థానిక ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి రాష్ట్ర రవాణా మంత్రి పొన్నం ప్రభాకర్‌కు విన్నవించారు.

మిర్యాలగూడ పట్టణం, న్యూస్‌టుడే: మహాలక్ష్మి పథకంలో భాగంగా ఆర్టీసీ పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం ప్రారంభించిన నాటి నుంచి ప్రయాణికుల సంఖ్య గణనీయంగా పెరిగింది. గతంలో ఉమ్మడి జిల్లాలో 60 శాతం ఉన్న ఓఆర్. ప్రస్తుతం 100శాతం పెరిగింది. పండగలు, సెలవు దినాల్లో 120శాతం పైగా ఓఆర్ నమోదవుతుంది. ఈ నేపథ్యంలో కరోనా అనంతరం రద్దయిన అనేక మార్గాలతో పాటు పలు కొత్త మార్గాలకు సైతం బస్సులు నడపాలని డిమాండ్లు పెరుగుతున్నాయి. ప్రస్తుతం అందుబాటులో ఉన్న వాటితోనే.. ప్రధాన మార్గాలకు బస్సులు నడుపుతుండగా.. ఆయా మార్గాల్లోనే సర్వీసుల సంఖ్య పెంచాల్సిన అవసరం ఉంది.

అదనంగా అవసరం..

పాత మార్గాల పునరుద్ధరణ, కొత్త మార్గాలు, ప్రస్తుత మార్గాల్లో అదనపు సర్వీసుల కోసం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 200కు పైగా బస్సులు అవసరం పడనున్నాయి. వీటిలో మిర్యాలగూడ డిపోకు సుమారుగా 35, దేవరకొండకు 25, కోదాడకు 25, నల్గొండకు 30, సూర్యాపేటకు 35, యాదగిరిగుట్టకు 25, నార్కట్‌పల్లి డిపోకు 30 బస్సులు అదనంగా కావాలని స్థానిక నాయకులు, ప్రయాణికులు కోరుతున్నారు.

పాతవి మార్చాలి..

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఇటీవల 79 కొత్త బస్సులు వచ్చాయి. ఇప్పటికే ఉన్న బస్సుల్లో 43 బస్సులను మార్చాల్సిన అవసరం ఉంది. నిబంధనల ప్రకారం 12 లక్షల కిలో మీటర్లు తిరిగిన, 15 ఏళ్లు దాటిన బస్సులను తుక్కుగా మార్చాల్సిన అవసరం ఉంది. బస్సుల లేమి కారణంగా తీసేయాల్సిన బస్సులను సైతం నడిపిస్తున్న పరిస్థితి నెలకొంది. నల్గొండ డిపోకు ఇటీవలే కొత్త రాజధాని బస్సు రాగా.. మిర్యాలగూడ డిపోలో ఉన్న పాత రాజధాని బస్సు తరచూ మొరాయిస్తుంది. ఇటువంటి బస్సుల వల్ల నిర్వహణ ఖర్చు అధికమవుతుందని మెకానిక్‌లు చెబుతున్నారు. వీటి స్థానంలో కొత్త బస్సులను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది.

ఉమ్మడి జిల్లాలో డిపోల వారీగా ఉన్న బస్సులు, కొత్తగా వచ్చిన వాటి వివరాలు..

డిపో	పల్లెవెలుగు	ఎక్స్‌ప్రెస్	డీలక్స్	సూపర్ లగ్జరీ	రాజధాని	కొత్త బస్సులు
దేవరకొండ	35	27	5	2	0	12
నల్గొండ	29	1	50	0	1	16
నార్కట్‌పల్లి	4	0	0	0	0	2
మిర్యాలగూడ	22	2	8	33	1	8
యాదగిరిగుట్ట	36+21 (మినీ)	16	0	0	0	10
కోదాడ	20	10	11	13	0	8
సూర్యాపేట	28	28	0	0	0	23

కొత్త బస్సులతో పాటు డ్రైవర్ల కోసం ప్రతిపాదనలు..

– రాజశేఖర్, ఆర్ఎం, నల్గొండ

ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా మరో 40 నూతన బస్సులకు ప్రతిపాదనలు పంపించాం. వీటితో పాటు 200 మంది డ్రైవర్ల నియామకానికి సైతం ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించాం. పాత మార్గాల నుంచి వినతులు వస్తున్నందున ఆదాయాన్ని బట్టి ఆయా మార్గాల్లో బస్సులు నడిపే అంశాన్ని సైతం పరిశీలించనున్నాం.

ఏఎమ్మార్పీ మోటారు మరమ్మతు విజయవంతం



నాలుగు మోటార్లతో పుట్టంగండి సిస్టర్న్‌కు విడుదలవుతున్న నీరు

పెద్దఅడిశర్లపల్లి, న్యూస్‌టుడే: జిల్లా వాసుల చిరకాల స్వప్నం ఎలిమినేటి మాధవరెడ్డి ప్రాజెక్టు పుట్టంగండి పంప్‌హౌజ్ మొదటి యూనిట్(మొదటి మోటారు) మరమ్మతులు ఎట్టకేలకు పూర్తయ్యాయి. ప్రాజెక్టు రూపకల్పనలో భాగంగా 1998లో రూ.90 కోట్లతో పుట్టంగండి పంప్‌హౌజ్‌లో జెన్‌కో, బీహెచ్ఈఎల్‌లు సంయుక్తంగా నాలుగు మోటార్లను ఏర్పాటు చేసి 2001 సెప్టెంబరు 1న మొదటి మోటారును ప్రారంభించారు. గతేడాది అక్టోబరులో ఈ మోటారు మరమ్మతులకు గురైంది. రూ.1.5 కోట్లతో టీజీజెన్‌కో ఆధ్వర్యంలో ఈ ఏడాది మే 20 నుంచి మరమ్మతులు ప్రారంభించారు.

❒ మోటారు క్యాపిటల్ ఓవరాయిలింగ్, వర్టికల్ ఫ్రాన్సిస్ టర్బైన్ రిపేర్, ఇతరత్రా అలైన్‌మెంట్ పనులను మంగళవారం అర్ధరాత్రి పూర్తి చేసి ప్రయోగాత్మకంగా పరిశీలన చేపట్టారు. రెండురోజులుగా పుట్టంగండి సర్జ్‌పూల్‌లో గేట్లు తెరుచుకోక ఇబ్బందులు పడిన అధికారులు ఎగువన సిస్టర్న్‌ను నుంచి రివర్స్ పంపింగ్‌తో తెరిచి విజయవంతంగా 600 క్యూసెక్కులు నీటిని ఈ మోటారుతో ఎత్తిపోశారు. మొత్తం నాలుగు మోటార్లతో 2400 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.

❒ ఖరీఫ్‌లో కేవలం మూడు మోటార్ల నీటితో ఇబ్బందులు పడిన ఆయకట్టు రైతుల కష్టాలు తీరనున్నాయి. రోనాల్డ్‌రోస్ ఆదేశాల మేరకు టీజీజెన్‌కో సీఈ వి.మంగేష్ కుమార్, ఎస్ఈ రఘురామ్‌లు కొద్ది రోజులుగా ఇక్కడే ఉండి పనులను పర్యవేక్షించారు. డీఈలు బాల్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, ప్రవీణ్‌కుమార్, వెంకటేశ్వర్లు, ఏడీఈలు సంజీవరెడ్డి, సుధాకర్, సత్యనారాయణ, నీటిపారుదలశాఖ డీఈ నాగయ్య, ఏఈ శిల్ప తదితరులున్నారు.

సర్వేతో సర్వత్రా ఆనందం



చింతలపాలెం శివారు ప్రాంతంలో ఎంజాయిమెంట్ సర్వే చేస్తున్న రెవెన్యూ బృందాలు

తిరుమలగిరి సాగర్, న్యూస్‌టుడే: స్వాతంత్ర్యం నాటి నుంచి సాగు చేసుకుంటున్న భూములు.. ఎన్నో ప్రభుత్వాలు మారాయి.. కానీ గిరిజనులకు మాత్రం కష్టాలు తగ్గలేదు. భూమి ఉందనే తప్పా వాటికంటూ ఎలాంటి పట్టాలు లేవు.. సంక్షేమ పథకాలు అందవు. దీని పరిష్కారానికే రాష్ట్ర ప్రభుత్వం అన్ని రకాల భూసంబంధిత సమస్యల కోసం పైలట్ ప్రాజెక్ట్ మండలకేంద్రంగా తిరుమలగిరి సాగర్‌ను ఎంపిక చేసింది. దీంతో ప్రభుత్వ, అటవీశాఖ, కాందిశీకుల భూములను ఎన్నో ఏళ్లుగా సాగు చేసుకుంటున్న గిరిజన రైతులకు ఊరట కలిగింది. అందులో కాందిశీకుల భూములు, అటవీశాఖ భూములు కేంద్ర పరిధిలో, ప్రభుత్వ, బంచరాయి భూములు రాష్ట్ర ప్రభుత్వం ఆధీనంలో ఉన్నాయి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 2004లో ఈపీ ల్యాండ్ కోసం ప్రత్యేక జీవో జారీ చేసింది. ప్రభుత్వ భూములకు అసైన్డ్ కమిటీ ఏర్పాటు చేసి ఎంజాయిమెంట్ సర్వే చేసి రాష్ట్రంలోని కాందిశీకుల భూములను సాగు చేసుకుంటున్న కొంత మంది రైతులకు వివిధ మండలాల్లో పట్టా పాసుపుస్తకాలను అందజేసింది. తిరుమలగిరి సాగర్ మండలంలో కూడా కొంత మంది రైతులకు మాత్రమే ప్రభుత్వం పట్టాలను అందజేసింది.

❒ ధరణి రావడంతో ఆ రైతుల పేర్లు కూడా ఆన్‌లైన్‌లో మాయమయ్యాయి. దీంతో అప్పటి నుంచి చింతలపాలెం, నాయకునితండా, తిమ్మాయిపాలెం శివారు ప్రాంతంలోని కాందిశీకుల భూములు సాగు చేసుకుంటున్న రైతులకు సంక్షేమ పథకాలు అందక పెట్టుబడి సాయానికి అప్పులు చేసి తిప్పలు పడుతున్నారు. వ్యవసాయమే జీవనాధారంగా బతుకుతున్న గిరిజనులకు పంట రుణాలు, రైతుబీమా, భరోసా అందక పెట్టుబడికి ఏటా ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి నెలకొంది.

❒ గత ప్రభుత్వాలు భూమి హక్కు పత్రాలు ఇచ్చిన పాసుపుస్తకాలు జారీచేయకపోవడంతో ఆన్‌లైన్‌లో వీరి పేర్లు నమోదు కాలేదు. దీంతో ఏళ్లుగా వీరికి రుణాలు రావడం లేదు.

అప్పుల బాధలు తప్పుతాయి..

– మునినాయక్, నాయకునితండా



ఏళ్ల తరబడి సాగుచేసుకుంటున్న ఆన్‌లైన్‌లో పేర్లు లేకపోవడంతో భూమి ఉందని చెప్పలేకపోతున్నాం. ప్రభుత్వం అందజేస్తున్న రైతు భరోసా, రుణమాఫీ వంటి పథకాలకు అర్హులం కాలేకపోయాం. కాందిశీకుల భూములకు సర్వే చేసి పట్టా పాసుపుస్తకాలు అందజేస్తే సంక్షేమ పథకాలు అంది అప్పుల బాధలు తప్పుతాయి.

కాందిశీకుల భూములకు పట్టా పాసుపుస్తకాలు..

మండలంలో కాందిశీకుల భూములను చింతలపాలెం, నాయకునితండా, తిమ్మాయిపాలెం గ్రామాలలో రైతులు సాగు చేసుకుంటున్నారు. రెవెన్యూ బృందాలు చింతలపాలెం రెవెన్యూ గ్రామ శివారు ప్రాంతాల్లో 28 సర్వే నంబరులో 766.27 ఎకరాలు, 52లో 761.31 ఎకరాలు, 60లో 660.20 ఎకరాలు, 16లో 8.04 ఎకరాలు, 70లో 4.04 ఎకరాలు, 204లో 13.03 ఎకరాలు, తిమ్మాయిపాలెం రెవెన్యూ గ్రామ శివారులో 24 సర్వే నంబరులో 105.15 ఎకరాలు, 38లో నంబరులో 550.16 ఎకరాల భూములకు ఎంజాయిమెంట్ సర్వే కొనసాగిస్తున్నారు. సర్వే పూర్తి చేసి తమ వివరాలను ఆన్‌లైన్ నమోదు చేస్తే పట్టాపాసుపుస్తకాలు ఉంటాయని లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

సాగులో ఉన్న రైతులకు పట్టాపాసుపుస్తకాలు

– అనిల్‌కుమార్, తహసీల్దారు, తిరుమలగిరి సాగర్ మండలం

ప్రభుత్వం భూమి సంబంధిత సమస్యల పరిష్కారానికి చేస్తున్న సర్వేలో భూమి సాగు చేస్తున్న రైతులందరికీ పట్టా పాసుపుస్తకాలు అందజేస్తాం. అర్హులైన రైతుల కాందిశీకుల భూములకు అప్పట్లో కాస్ట్‌ఆఫ్ పేమెంట్ కింద ఉన్న భూములకు పట్టా పాసుపుస్తకాలు, పేమెంట్ చేయని రైతులకు ప్రభుత్వ భూముల కింద పాసుపుస్తకాలను ఇచ్చి ఆన్‌లైన్‌లో నమోదు చేస్తాం.

మిల్లర్లు ధాన్యం కొనుగోలుకు సిద్ధం కావాలి



ధాన్యం కొనుగోలుపై మిల్లర్లతో సమీక్షిస్తున్న అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్

నల్గొండ సంక్షేమం, న్యూస్‌టుడే: వానాకాలం ధాన్యం కొనుగోలుకు మిల్లర్లు సిద్ధం కావాలని అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్ తెలిపారు. వానాకాలం ధాన్యం కొనుగోలు, సీఎంఆర్‌పై బుధవారం కలెక్టరేట్‌లో సమీక్షించారు. రాష్ట్రవ్యాప్తంగా సీఎంఆర్ 70శాతం పూర్తవగా, నల్గొండ జిల్లాలో సీఎంఆర్ 90 శాతం పూర్తయ్యిందని చెప్పారు. మిగిలిన పది శాతం వారం రోజుల్లో పూర్తి చేయాలని ఆదేశించారు. పూర్తి చేయని వారిని గుర్తించి వచ్చే సీజన్‌లో ధాన్యం కేటాయింపు ఉండదని స్పష్టం చేశారు. జిల్లా పౌర సరఫరాల అధికారి వెంకటేశ్వర్లు, పౌర సరఫరాల సంస్థ మేనేజర్ హరీష్, నల్గొండ రైస్‌మిల్లర్ల సంఘం జిల్లా అధ్యక్షులు నారాయణ, మిర్యాలగూడ రైస్‌మిల్లర్ల సంఘం జిల్లా అధ్యక్షులు శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

❒ వివిధ ప్రాజెక్టుల కింద భూసేకరణ, పునరావాస కేంద్రాల పనులకు సంబంధించి పెండింగ్ పనులను ప్రాధాన్యతా క్రమంలో విభజించుకుని పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్ ఆదేశించారు. పునరావాస కేంద్రాలు, భూసేకరణపై బుధవారం కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఆయా ప్రాజెక్టుల కింద రిజర్వాయర్‌లు తదితర చోట్ల ఆర్‌అండ్‌ఆర్ పనులు, భూసేకరణకు సంబంధించిన సమస్యలు ఉంటే వెంటనే సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేసుకుని వేగవంతం చేయాలన్నారు. మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్, డీఎఫ్‌వో రాజశేఖర్, స్పెషల్ కలెక్టర్ నటరాజ్, ఆర్డీవోలు, ప్రాజెక్టు అధికారులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శుల సామూహిక సెలవు



అదనపు కలెక్టర్‌తో చర్చిస్తున్న పంచాయతీ కార్యదర్శుల సంఘం ప్రతినిధులు

నల్గొండ కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లాలో ఇటీవల సస్పెండ్ చేసిన వారిని విధుల్లోకి తీసుకోవాలని కోరుతూ పంచాయతీ కార్యదర్శులు బుధవారం సామూహిక సెలవు పెట్టారు. విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మంగళవారం కలెక్టర్ గుర్రంపోడు ఎంపీడీవో, ఇద్దరు పంచాయతీ కార్యదర్శులను సస్పెండ్ చేశారు. దీనికి నిరసనగా పంచాయతీ కార్యదర్శులు, ఎంపీవో, ఎంపీడీవోలు ఆందోళన బాట పట్టారు. అనంతరం అదనపు కలెక్టర్(స్థానిక సంస్థలు)కు తమ సమస్యలను పరిష్కరించాలని వినతి పత్రం అందచేశారు. జిల్లాలో పంచాయతీ కార్యదర్శులు ప్రభుత్వం నిధులు విడుదల చేయక ఆర్థిక సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొంటూ గ్రామాల్లో ప్రజలకు సేవ చేస్తున్నారని వినతి పత్రంలో వివరించారు. నెలవారి వేతనం నుంచి గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి డబ్బులు ఖర్చు చేస్తున్నట్లు తెలిపారు. తమ సమస్యలు పట్టించుకోకుండా పై అధికారులు అకారణంగా చర్యలు తీసుకుంటున్నారని పేర్కొన్నారు. తమ సమస్యలు పరిష్కారం అయ్యేవరకు సామూహిక సెలవులు పెడుతున్నట్లు తెలిపారు. అనంతరం అదనపు కలెక్టర్ పూర్ణచందర్ కార్యదర్శుల సంఘం ప్రతినిధులతో చర్చించారు. కలెక్టర్ పర్యటనలో ఉన్నందున వచ్చిన తర్వాత చర్చించి సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేయనున్నట్లు అదనపు కలెక్టర్ హామీ ఇచ్చారు. అప్పటి వరకు సెలవులో వెల్లవద్దని సూచించారు. దీంతో సంఘం ప్రతినిధులు అంగీకారం తెలిపారు. గురువారం నుంచి యథావిధిగా విధులకు హాజరుకానున్నట్లు తెలిపారు. గుర్రంపోడు ఎంపీడీవో సస్పెన్షన్ నిరసనగా తాము సామూహిక సెలవులో వెళ్లనున్నట్లు ఎంపీడీవోలు జడ్పీ సీఈవోకు వినతి పత్రం అందచేశారు. గురువారం పంచాయతీరాజ్ కమిషనర్‌ను కలవనున్నట్లు ఎంపీడీవోల సంఘం ప్రతినిధులు తెలిపారు.

వయో వృద్ధులకు క్రీడా పోటీలు

నల్గొండ విద్యావిభాగం, న్యూస్‌టుడే: ప్రపంచ వయోవృద్ధుల దినోత్సవం వారోత్సవాల గోడపత్రికను స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ టి.పూర్ణచంద్ర బుధవారం కలెక్టరేట్‌లో విడుదల చేశారు. వచ్చే నెల ఒకటో తేదీన ప్రపంచ వయోవృద్ధుల దినోత్సవం సందర్భంగా ఐదు రోజుల పాటు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ నెల 26న క్రీడా పోటీలు, 27న హక్కులపై అవగాహన కార్యక్రమాలు, మారథాన్ వాక్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 28న తల్లిదండ్రుల పోషణ సంరక్షణ చట్టం 2007పై జిల్లా స్థాయిలో అవగాహన, 29న గ్రామ పంచాయతీల్లో సర్పంచులకు, గ్రామస్థాయి అధికారులకు తల్లిదండ్రుల పోషణ సంరక్షణ చట్టం 2007పై, వయోవృద్ధుల హక్కులు కనీస అవసరాలపై అవగాహన, 30న అన్ని అంగన్‌వాడీ కేంద్రాలలో గ్రాండ్ పేరెంట్స్ డే నిర్వహించాలని నిర్ణయించారు. జిల్లా స్థాయిలో అక్టోబరు 1న కలెక్టరేట్‌లో ప్రపంచ వయోవృద్ధుల దినోత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లా సంక్షేమ అధికారిని సక్కుబాయి, సీనియర్ సిటిజన్ సంఘం జిల్లా అధ్యక్షులు సముద్రాల మల్లిఖార్జున్, శ్రీనివాస్‌రెడ్డి, మునగాల నాగిరెడ్డి, శ్రీకాంత్ పాల్గొన్నారు.

నియామకం

నీలగిరి, న్యూస్‌టుడే: నల్గొండ, వరంగల్, ఖమ్మం ఉమ్మడి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నల్గొండ జిల్లా ఇన్‌ఛార్జిగా ఎల్వీరమణ ముదిరాజును నియమించారు. భాజపా జిల్లా అధ్యక్షుడు డాక్టర్ నాగం వర్షిత్‌రెడ్డి బుధవారం నియామక పత్రం అందజేసి సన్మానించారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ గెలుపు కోసం అందరిని కలుపుకుని పనిచేయాలని సూచించారు.

భరోసాతో.. దసరా పండగేనా..!




అడవిదేవులపల్లిలో సాగు చేసిన పత్తిచేను

అడవిదేవులపల్లి, న్యూస్‌టుడే: తమ ప్రభుత్వ హయాంలో భారాస రైతులకు ఖరీఫ్, రబీ సీజన్లలో పంట సాయం కోసం రైతుబంధు పథకాన్ని ప్రవేశపెట్టింది. కాంగ్రెస్ ప్రభుత్వం దాన్ని రైతు భరోసాగా మార్పు చేసింది. ఈ పథకం కింద ఆర్థిక సాయం జులైలోనే అందించాల్సి ఉండగా.. పలు కారణాల వల్ల తాత్సారం చేస్తూ వచ్చింది.

● ఆగస్టు 15 నుంచి రుణమాఫీ మూడు విడతలుగా చేసినా.. ఇంకా చాలా మంది రైతులకు సొమ్ము అందలేదు. మాఫీ అయిన వారికి సైతం చాలా వరకు ఇంకా బ్యాంకుల చుట్టూ తిరిగినా రుణాలు ఇవ్వలేదని రైతులు చెబుతున్నారు. ఈ క్రమంలో అక్టోబరులో రైతుభరోసా ఇవ్వనున్నామని ప్రభుత్వ పెద్దలు అంటుండడంతో రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. ఖరీఫ్ సీజన్ పంట కాలం మరో 15 రోజుల్లో ముగియనుంది. పంట మొదట్లో ఇవ్వాల్సిన ఆర్థిక సాయం కనీసం చివర్లోనైనా ఇస్తే బాగుండని ఉమ్మడి జిల్లాలోని 23.73 లక్షల మంది రైతుల ఎదురుచూస్తున్నారు.

ఉమ్మడి జిల్లాలో ఖరీఫ్‌లో సాగు చేసిన రైతులు, సాగు విస్తీర్ణం వివరాలు..



పెరుగుతుందన్న ఆశ

అధికారంలోకి వస్తే ఎకరాకు రూ.15వేల రైతుభరోసా ఇస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చింది. ఎన్నికల సమయంలో గత ప్రభుత్వం రైతు భరోసా ఇవ్వడానికి నిధులు సిద్ధం చేయగా ఎన్నికల సంఘం నిలిపివేసింది. ఇక అప్పటి నుంచి రైతు భరోసా రైతులకు అందలేదు.

● తాజా ప్రభుత్వం దసరాకు భరోసా ఇస్తామంటోంది. ప్రస్తుతం మరో నెల రోజుల్లో రబీ సీజన్ కూడా మొదలవుతోంది. రెండు పంటలవి కలిపి ఎకరాకు రూ.15వేలు జమ చేస్తుందా లేక ఖరీఫ్‌వి మాత్రమే జమ చేస్తుందా అన్న దానిపై స్పష్టత లేదు.

మార్గదర్శకాలపై ఆందోళన

ఇక ప్రభుత్వం రైతు భరోసా నిధుల జమకు సంబంధించిన మార్గదర్శకాలు ఏ విధంగా ఉండబోతున్నాయనే దానిపై రైతులు ఆందోళనలో ఉన్నారు. ముఖ్యంగా సన్నకారు రైతులకు ఎలాంటి ఢోకా లేకున్నా పెద్దకారు రైతుల్లో మాత్రం ఆందోళన ఉంది. కటాఫ్ ఎన్ని ఎకరాలు ఉండబోతుందో అన్న సందేహాలున్నాయి.

● ప్రభుత్వం పదెకరాల్లోపు ఉన్న రైతులకు మాత్రమే ఇస్తే మిగతా వారికి రైతు భరోసా దూరం కానుంది. ప్రభుత్వ ఉద్యోగులుగా పనిచేస్తున్నవారికి కూడా రైతు భరోపా కోత పెట్టాలన్న యోచనతో ప్రభుత్వం ఉందని రైతులు భావిస్తున్నారు. ఇలాంటి వాటన్నిటికీ నెలాఖరులోపు స్పష్టత వచ్చే అవకాశం ఉందని వ్యవసాయాధికారులు చెబుతున్నారు.

యాదాద్రి లడ్డూ ప్రసాదాల్లో పూర్తి నాణ్యత

మదర్ డెయిరీ ద్వారా నెయ్యి సరఫరా

యంత్రాలతో నిత్యం తయారీ

ఆలయ ఈవో భాస్కరరావు వెల్లడి



లడ్డూ ప్రసాదం తయారీని పరిశీలిస్తున్న ఆలయ ఈవో భాస్కరరావు

యాదగిరిగుట్ట, న్యూస్‌టుడే: 'తెలంగాణలో ప్రసిద్ధి చెందిన యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్ర ప్రాధాన్యం, విశిష్టతలను మరింత పెంచే దిశగా దేవుడి ప్రసాదాల తయారీలో కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నాం. ఎప్పటికప్పుడు ప్రత్యేక దృష్టి కేంద్రీకరించి, భక్తులకు విక్రయిస్తున్నాం'. అని యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానం కార్యనిర్వహణ అధికారి భాస్కరరావు 'న్యూస్‌టుడే'కు తెలిపారు.

'యాదాద్రి క్షేత్ర సందర్శనకు వచ్చే భక్తులు లడ్డూ ప్రసాదాల కొనుగోలుకు అత్యంత ఆసక్తి చూపిస్తారు. నమ్మక, విశ్వాసాలకు లోపం జరగకుండా దినుసులను ప్రభుత్వ సంబంధిత శాఖ ధ్రువీకరణతోనే ప్రసాదాల తయారీకి వినియోగిస్తున్నాం. నిత్యం వంద గ్రాముల లడ్డూలను 25 వేల నుంచి 28 వేల వరకు తయారీ చేస్తున్నాం. ఇంకా అవసరమైతే అప్పటికప్పుడు సిద్ధం చేసే సామర్థ్యం యంత్రాల ద్వారా ఉంది. లడ్డూ తయారీకి మదర్ డెయిరీ ద్వారా కేజీ రూ.609 నెయ్యిని అవసరానికి తగ్గట్టు తెప్పించుకుంటాం. ఆ నెయ్యిని వెంటనే టెస్టింగ్ చేసిన ధ్రువీకరణ పత్రాన్ని డెయిరీ నిర్వాహకులు పంపిస్తారు. వచ్చిన నెయ్యి నాణ్యత ప్రమాణాలు తెలుసుకునేందుకు నాచారంలోని ప్రభుత్వ ల్యాబ్‌కు పంపిస్తున్నాం' అని పేర్కొన్నారు.



లడ్డూ ప్రసాదాలు



నెయ్యి

భోగ్ సర్టిఫికెట్: ఈ క్షేత్రంలో విక్రయించే ప్రసాదాలు పూర్తి నాణ్యతా ప్రమాణాలు కలిగినవని చెప్పడానికి కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ పరిధిలోని ఆహార భద్రత ప్రమాణాల ప్రాధికార సంస్థ (ఎఫ్ఎస్ఎస్ఏఐ) జాతీయ సర్టిఫికెట్ భోగ్ (బ్లిస్ ఫుల్ హైజీన్ ఆఫరింగ్ టు గాడ్) గుర్తింపు ఉంది.

చిరు ధాన్యాలతో: చిరు ధాన్యాలతో తయారీ చేసే లడ్డూ ప్రసాదాలను విక్రయిస్తున్నారు. 80 గ్రాముల మిల్లెట్స్ లడ్డూ ధర రూ.40, ఇక 200 గ్రాముల బరువు కలిగిన పులిహోర ప్రసాదం రూ.30, 500 గ్రాముల బరువు కలిగిన పెద్ద లడ్డూ రూ.150కి విక్రయిస్తారు.

లడ్డూ తయారీకి వాడే సరకులు:

లడ్డూ ప్రసాదం తయారీకి శాస్త్ర రీత్యా వాడే సరకులను దిట్టం అంటారు. ఒక కేజీ లడ్డూకు నెయ్యి 900 గ్రాములు, చక్కెర 2 వేల గ్రాములు, శనగపిండి వెయ్యి గ్రాములు, కాజు 75 గ్రాములు, కిస్మిస్ 50 గ్రాములు, ఇలాచి 10 గ్రాములు, పచ్చ కర్పూరం రెండు గ్రాములు, జాజికాయ రెండు గ్రాములు.

◆ పై దినుసుల ద్వారా వంద గ్రాముల లడ్డూ 45 తయారవుతాయి. ఈ ఆలయ లడ్డూ రుచి, నాణ్యత తగ్గకుండా, ఐదు రోజుల నుంచి ఒక వారం రోజుల వరకు నిల్వ ఉంటుంది.

అరచేతిలో.. అంతర్జాలంలో..

ఎస్పీడీసీఎల్ యాప్ ద్వారా 19 రకాల సేవలు

రోజురోజుకూ సాంకేతిక వినియోగం పెరుగుతుండటంతో ప్రభుత్వ రంగ సంస్థలు ఆ వైపు అడుగులు వేస్తున్నాయి. విద్యుత్తు శాఖ లోనూ సాంకేతికతను జోడించింది. బిల్లు చెల్లింపుతో పాటు 19 రకాల సేవలను చరవాణి ద్వారా అందించడానికి 'ఎస్పీడీసీఎల్' అనే యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చారు.

-భానుపురి, న్యూస్‌టుడే

డౌన్‌లోడ్ ఇలా..

ఎస్పీడీసీఎల్ యాప్‌ను ప్లేస్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలి. ఈ- మెయిల్ ఐడీతో లాగిన్ అవ్వాలి. యూఎస్సీ సంఖ్యను నమోదు చేయగానే తెర మీద పలు అంశాలతో కూడిన ఎంపిక కనిపిస్తుంది. వీటిలో సమస్యలపై ఫిర్యాదు చేయడానికి కాకుండా అది పరిష్కారమైందో లేదో తెలుసుకోవచ్చు.

ముందే బిల్లు తెలుసుకోవచ్చు

ప్రతి నెల మీటర్ రీడింగ్ ప్రకారం ఎన్ని యూనిట్ల కరెంటు వినియోగం చారు.. ఎంత బిల్లు వస్తుందో చాలా మందికి అవగాహన ఉండదు. యాప్ ద్వారా ఎన్ని యూనిట్లకు ఎంత బిల్లు వస్తుందనే వివరాలు ముందుగానే తెలుసుకోవచ్చు. ఆధార్ లింక్, చరవాణి నెంబరు నమోదుతో యాప్‌లోనే విద్యుత్తు బిల్లు చెల్లించటంతోపాటు గతంలో చెల్లించిన బిల్లులను సైతం చూసుకోవచ్చు.

ఫిర్యాదు.. సూచనలు

వినియోగదారుడి పేరు, లోడు, మార్పు, టారిఫ్ వివరాలు, ఏ కేటగిరికి ఎంత ఛార్జి, గృహ, గృహేతర, పరిశ్రమలకు ఎంత బిల్లు వసూలు చేస్తారు అనే విషయాలు తెలుసుకోవచ్చు. విద్యుత్తును ఎలా పొదుపు చేయాలి. ఎక్కడైనా ఏదైనా ప్రమాదం జరిగితే జీపీఎస్ లోకేషన్ ఆధారంగా చరవాణిలో ఫొటో తీసి పంపి దాని వివరాలు నమోదు చేస్తే సంబంధిత అధికారికి వెళ్తుంది. వారు స్పందించి చర్యలు తీసుకుంటారు. కరెంటు ప్రమాదాలపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు తదితర అంశాలపై ఫీడ్‌బ్యాక్‌తోపాటు అత్యవసర సమయంలో సంప్రదించాల్సిన టోల్‌ఫ్రీ నంబరును కూడా యాప్‌లో పొందుపరిచారు. వినియోగదారుడు తన సమస్యను ఫిర్యాదు ద్వారా అధికారులకు తెలపవచ్చు. ఇందుకు మీటర్ నంబరుతో సమస్యను నమోదు చేసి పంపించాలి.



వివిధ రకాల సదుపాయాలు కలిగిన యాప్

ఆత్మహత్య కాదు.. హత్యాచారమే: డీఎస్పీ

మిర్యాలగూడ, న్యూస్‌టుడే: ప్రేమించిన యువతిని అడ్డుతొలగించుకునేందుకు ఆమెపై మరికొందరితో అత్యాచారం చేసి పాశవికంగా హత్య చేసిన కేసులో రూపావత్ నాగు, రూపావత్ బుజ్జి, రమావత్ క్రాంతికుమార్‌ను బుధవారం అరెస్టు చేసి రిమాండ్‌కు పంపుతున్నట్లు మిర్యాలగూడ డీఎస్పీ రాజశేఖర్ రాజు తెలిపారు. కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు.

✦ దామరచర్ల మండలం పుట్టలగడ్డ గ్రామానికి చెందిన 19 ఏళ్ల యువతిని అదే గ్రామానికి చెందిన రూపావత్ నాగు రెండేళ్లుగా ప్రేమ పేరుతో నమ్మించి శారీరకంగా కలిసి రెండు సార్లు గర్భస్రావం చేయించాడు. ఈ విషయమై యువతి తల్లిదండ్రులు నాగు తల్లిదండ్రులను కలిసి వివాహం జరిపించాలని కోరగా అందుకు అంగీకరించలేదు. కొంతకాలంగా నాగు సదరు యువతి చరవాణి నంబరును బ్లాక్ చేసి దూరం పెడుతున్నాడు.

✦ ఈనెల 14న సదరు యువతి నాగు వద్దకు వెళ్లి పెళ్లి చేసుకోవాలని నిలదీసింది. యువతిని మాయమాటలతో నమ్మించిన రూపావత్ నాగు అతని తల్లి బుజ్జి, బావ రమావత్ క్రాంతికుమార్‌లు ఊరిబయట మాట్లాడేందుకు తీసుకెళ్లారు.

✦ అక్కడ బుజ్జి కాపలా ఉండగా నాగు, క్రాంతి కుమార్‌లు యువతిపై పలుమార్లు అత్యాచారానికి పాల్పడి.. గొంతు నొక్కి చంపి చెట్టుకు వేలాడదీసి సదరు యువతి బలవన్మరణానికి పాల్పడినట్లు చిత్రీకరించారు. 15వ తేదీ ఉదయం యువతి మృతదేహాన్ని పరిశీలించిన పోలీసులు అనుమానంతో విచారణ చేపట్టగా హత్యాచారం విషయం వెలుగు చూసింది.

✦ బుధవారం ఉదయం వాడపల్లి ఎస్సై రవి జాన్‌పహాడ్ రోడ్డుపై వాహనాలు తనిఖీ చేస్తుండగా రూపావత్ నాగు, బుజ్జి, రమావత్ క్రాంతిలు కనిపించగా.. అదుపులోకి తీసుకున్నారు. కాగా ఇదే కేసులో పలువురు అనుమానితులపై విచారణ జరుపుతున్నామని డీఎస్పీ రాజశేఖర్‌రాజు తెలిపారు. కేసు విచారణ వేగంగా పూర్తి చేసిన గ్రామీణ సీఐ వీరబాబు, వాడపల్లి ఎస్సై రవి సిబ్బందిని డీఎస్పీ అభినందించారు.



సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ రాజశేఖర్ రాజు, సీఐ వీరబాబు

పోగు పోసుకుంటున్న జీవితాలు

చండూరు, న్యూస్‌టుడే: అక్షరాలు నేర్వకపోయినా.. గడ్డి పరకల కలయికను చూసి పడుగు పేకలు కలిపి మానవ ప్రపంచానికి వస్త్రాలు నేస్తూ చేనేత రంగంలో రాణిస్తున్నారు చండూరుకు చెందిన పలువురు చేనేత మహిళలు. ఆ రంగానికి ఆదరణ తగ్గి ఉపాధి అంతంతమాత్రంగానే ఉన్నా.. కులవృత్తిని వీడలేక.. వేరే పని చేయలేక.. కుటుంబానికి ఆసరాగా ఉంటుందని మరికొందరు.. వృత్తిని చేపడుతున్నారు.

ఉపాధి కల్పిస్తున్నాం...

– చిలుకూరి యశోద

మాది చండూరు. భర్త చిలుకూరి రామకృష్ణ సుమారు 50 మందికి మగ్గం పని అప్పగిస్తారు. దీంతో ఆ 50 కుటుంబాలకు ఉపాధి లభిస్తుంది. వీరితో పాటు అదనంగా మరో 10 మంది మహిళలు చిటికిలు కట్టడం, రంగులు అద్దడం, డిజైన్‌లు గీయడం, మగ్గం నేయడం వంటి పనులు చేస్తుంటారు. వారితో పాటు నేను కూడా నేత పని చేస్తూ డిజైన్లు గీస్తుంటాను. మేము రూ.లక్షల్లో పెట్టుబడులు పెట్టి చేనేత చీరలు తయారు చేస్తుంటే ప్రింటెడ్ కంపెనీలు యథేచ్ఛగా మార్కెట్లలోకి వస్తున్నాయి. దీంతో మా వస్త్రాలు ఖరీదు కావడం లేదు. దీంతో మాపై ఆధారపడిన చేనేత కుటుంబాలకు పని కల్పించడం భారంగా మారింది.



ఆర్థిక ఇబ్బందులు లేవు

– ప్రసన్న



నా భర్త ప్రైవేట్ వ్యాపారం నిర్వహిస్తుంటారు. ఆయనకు వచ్చే సంపాదనతో కుటుంబం గడవడం కష్టంగా ఉంది. దీంతో 14 ఏళ్లుగా మాస్టర్ వీవర్‌ల వద్ద చేనేత పని (రంగులు అద్దడం, చిటికిలు కట్టడం, డిజైన్‌లు గీయడం) చేస్తుంటాను. రోజు ఎనిమిది గంటలు పని చేస్తే రూ.600 చెల్లిస్తారు. ప్రతి రోజు పని దొరుకుతుంది. నేను మా భర్త ఇద్దరం పని చేయడం వల్ల ఎటువంటి ఆర్థిక ఇబ్బందులు లేవు.

భర్తకు తోడుగా...

–గజం పల్లవి



నేను, నా భర్త ఇద్దరం చండూరుకు చెందిన మాస్టర్ వీవర్ చిలుకూరి రామకృష్ణ దగ్గర పని చేస్తుంటాం. ఇద్దరికి రోజూ చెరో రూ.600 చొప్పున కూలీ చెల్లిస్తుంటారు. గతంలో మేం సొంతంగా చీరలు తయారు చేసే వాళ్లం. చేనేత వస్త్రాలకు ఆదరణ తగ్గడంతో పెట్టుబడి పెట్టలేక వేరే పని చేయలేక మా కులవృత్తి వీడలేక మాస్టర్ వీవర్ వద్ద పని చేస్తూ కుటుంబాన్ని గడుపుతున్నాం.

ఎస్‌జీఎఫ్ ఫుట్‌బాల్ జట్ల ఎంపిక పోటీలు 28న

ఆలేరు, న్యూస్‌టుడే: ఎస్‌జీఎఫ్ ఫుట్‌బాల్ అండర్-17 నల్గొండ ఉమ్మడి జిల్లా బాలురు, బాలికల జట్ల ఎంపిక పోటీలు ఈ నెల 28న ఆలేరులో జరుగుతాయని ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి బెజ్జం బాలకృష్ణ బుధవారం ఆలేరులో చెప్పారు. పోటీలలో పాల్గొనే వారు 01.01.2008 తర్వాత జన్మించిన వారై ఉండాలన్నారు. ఆసక్తిగల వారు ఉదయం 9గంటలకు ఆలేరు జడ్పీఉన్నత పాఠశాల క్రీడా మైదానానికి చేరుకోవాలని తెలిపారు. పూర్తి వివరాలకు ఎస్‌జీఎఫ్ కార్యనిర్వాహక కార్యదర్శి జి. మధుసూదన్ 9000989671 చరవాణి నెంబరులో సంప్రదించాలన్నారు.

ఉమ్మడి జిల్లాలో 12 మంది ఎస్సైలకు స్థానచలనం

నల్గొండ నేరవిభాగం, న్యూస్‌టుడే: ఉమ్మడి జిల్లాలో 12 మంది ఎస్సైలకు స్థాన చలనం జరిగింది. ఈ మేరకు బుధవారం డీఐజీ కార్యాలయం నుంచి జిల్లా ఎస్పీ కార్యాలయాలకు ఆదేశాలు జారీ అయ్యాయి. బదిలీ అయిన ఎస్సైల వివరాలు ఇలా ఉన్నాయి.

పేరు	ప్రస్తుతం	బదిలీ స్థానం
యస్‌కే యాకూబ్	వీఆర్ సూర్యాపేట	డీసీఆర్‌బీ సూర్యాపేట
వి. మహేశ్వర్	డీఎస్‌బీ నల్గొండ	డీఎస్‌బీ సూర్యాపేట
వీ. వెంకటేశ్వర్లు	వీఆర్ నల్గొండ	డీఎసీబీ సూర్యాపేట
యస్‌కే సైదులు	డీసీఆర్‌బీ నల్గొండ	కోదాడ టౌన్
ఎస్. కృష్ణయ్య	మిర్యాలగూడ టౌన్	మాడ్గులపల్లి
జీ. శోభన్‌బాబు	మాడ్గులపల్లి	వీఆర్ నల్గొండ
డి. వెంకటేశ్వర్లు	డీసీఆర్‌బీ సూర్యాపేట	వేములపల్లి
డి. విజయ్ కుమార్	వేములపల్లి	వీఆర్ నల్గొండ
పి. లోకేశ్ కుమార్	సూర్యాపేట వన్ టౌన్	మిర్యాలగూడ రూరల్
ఎన్. సందీప్‌రెడ్డి	నల్గొండ వన్ టౌన్	మిర్యాలగూడ రూరల్-2
వి. శేఖర్	మిర్యాలగూడ వన్ టౌన్	అడవిదేవులపల్లి
బి. సాయిప్రశాంత్	సీసీఎస్ సూర్యాపేట	తిప్పర్తి

ప్రమాదవశాత్తు కాలువలో పడి ఇద్దరి గల్లంతు

నిడమనూరు, న్యూస్‌టుడే: సాగర్ ఎడమకాలువలో దుస్తులు ఉతికే క్రమంలో ప్రమాదవశాత్తు అందులో పడి యువతీయువకుడు గల్లంతైన ఘటన నిడమనూరు మండల పరిధిలో బుధవారం చోటుచేసుకుంది. ప్రత్యక్షసాక్షులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. త్రిపురారానికి చెందిన వేమవరపు సాయి(25) సొంతగ్రామంలో కూరగాయాల దుకాణం నడిపిస్తున్నాడు. అతడు వచ్చేవారంలో భవాని మాలధారణ చేయాలనే ఉద్దేశంతో ఇంట్లోని దుస్తులను ఉతకడానికి తనకు సాయంగా అతడి దుకాణంలో పనిచేస్తున్న త్రిపురారానికి చెందిన మేదరి శైలజ(30), అవిరెండ్ల రమాదేవిలను తీసుకుని సాయంత్రం నాలుగున్నరకు బొక్కమంతలపహాడ్ సమీపంలోని ఎడమకాలువ వద్దకు వెళ్లాడు. కాలువ మెట్ల మీద నిలబడి దుస్తులు ఉతుకుతుండగా ప్రమాదవశాత్తు శైలజ, సాయి కాలువలో జారి పడ్డారు. నీటి ఉద్ధృతికి వారు కొట్టుకుపోతుండగా.. వారిని కాపాడేందుకు ప్రయత్నించిన రమాదేవీ కాలువలో పడింది. ముగ్గురు కొట్టుకుపోతుండగా కాలువపై అక్కడే ఉన్న స్థానికుడు ధర్మారపు జానయ్య.. ధర్మారపు సైదులు సాయంతో రమాదేవికి చీర అందించి కాపాడారు. మిగిలిన ఇద్దరిని కాపాడే ప్రయత్నం చేసినా ఫలితం లేకపోయింది. సాయికి కొన్నేళ్ల క్రితం వివాహం కాగా.. కుమారుడు ఉన్నాడు. మనస్పర్థల కారణంగా అతడి భార్య కొన్ని రోజులుగా పుట్టింటి వద్దే ఉంటోంది. గల్లంతైన మరో మహిళ మేదరి శైలజకు వివాహమై ముగ్గురు కుమార్తెలున్నారు. ఆమె భర్త జానయ్య సుతారి మేస్త్రీగా పనిచేస్తున్నాడు. నిడమనూరు ఎస్సై గోపాల్‌రావు, ఏఎస్సై రమేష్ సిబ్బందితో కలిసి గాలింపు చర్యలు చేపట్టారు.



వేమవరపు సాయి



మేదరి శైలజ

ఎత్తుకు తగ్గ బరువున్నానా.. మేడమ్..!

పోషణ మాసోత్సవాల సందర్భంగా.. ఐసీడీఎస్ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాలలో నిర్వహించిన కార్యక్రమంలో డాక్టర్ కల్యాణి ఆయా కేంద్రాల పరిధిలోని చిన్నారులు వయసుకు తగ్గ బరువు, ఎత్తుకు తగ్గ బరువు ఉన్నారో పరీక్షించారు. వారి తల్లిదండ్రులకు పోషకాహారంపై అవగాహన కల్పించారు.

– న్యూస్‌టుడే, హుజూర్‌నగర్



కరవు నేలకు గోదారి.. పూజలతో ప్రణమిల్లి..!

మల్లన్నసాగర్ జలాశయం నుంచి గోదావరి జలాలు వదలడంతో.. తుర్కపల్లి మండలంలోని గంధమల్ల చెరువు నిండింది. అలుగు పోస్తుండటంతో ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య బుధవారం గంగకు పూజలు చేస్తున్న దృశ్యమిది.

–న్యూస్‌టుడే, తుర్కపల్లి



పాలేరు వరకు నీటి విడుదల



కేఆర్పీపురం వద్ద ఎడమ కాల్వకు గండిపడిన చోట ఏర్పాటు చేసిన ఇసుక బస్తాలు

నడిగూడెం, న్యూస్‌టుడే: సాగర్ ఎడమ కాల్వలో బుధవారం రాత్రి పాలేరు వరకు సాగు నీరు విడుదల చేశారు. ఎడమ కాల్వకు రెండు చోట్ల గండ్లు పడటంతో కాల్వలకు సాగునీటి విడుదలను నిలుపుదల చేశారు. అనంతరం ఎడమ కాల్వ పరిధిలో 128 కి.మీ. వద్ద క్రాస్ బండ్ ఏర్పాటు చేసి అక్కడివరకు సాగునీరు విడుదల చేశారు. గండి పరిసర ప్రాంతంలో సాగులో ఉన్న పంట పొలాలు ఎండుతున్నాయని మంత్రి ఉత్తమ్ పర్యటనలో రైతులు ఆందోళన వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. దీంతో ఎడమ కాల్వకు పూర్తి స్థాయిలో సాగునీరు విడుదల చేయాలని మంత్రి అధికారులను ఆదేశించడంతో క్రాస్ బండ్‌ను అధికారులు పొక్లెయిన్‌తో బుధవారం రాత్రి తొలగించారు. దీంతో ఎడమ కాల్వ పరిధిలో పాలేరు వరకు సాగర్ నీరు చేరేందుకు మార్గం సుగమమైంది. 132 కి.మీ. వద్ద గండి పూడ్చిన అధికారులు కాల్వ కట్ట పైవరకు ఇసుక బస్తాలను రక్షణ గోడగా ఏర్పాటు చేశారు. ఇంకా రెండు అడుగుల మేర బస్తాలు ఏర్పాటు చేయాల్సి ఉంది. ప్రస్తుతం కాల్వలో 5 నుంచి 6 అడుగుల మేరకే నీటి ప్రవాహం కొనసాగుతోంది. కాల్వలో నీటి మట్టం పెరిగేలోగా ఇసుక బస్తాల ఏర్పాటు పూర్తవుతుందని, ఈ లోగా నీటి విడుదలకు సమస్య లేదని భావించి అధికారులు కాల్వకు నీరు విడుదల చేశారు. గండి ప్రాంతం వరకు సాగు నీరు రావడంతో 25 రోజులుగా సాగునీటికి నోచుకోని కాగితరామచంద్రాపురం రైతులు హర్షం వ్యక్తం చేశారు.

చికెన్ ధరలు

ఫాంరేటు	125–00
రిటైల్	147–00
డ్రెస్డ్	213–00
స్కిన్‌లెస్	243–00

క్రోచెట్ ఈవెంట్‌లో గిన్నిస్ వరల్డ్ రికార్డు



గిన్నిస్ వరల్డ్ రికార్డు అందుకుంటున్న గుండా సంతోషి

దేవరకొండ, న్యూస్‌టుడే: క్రోచెట్ ఈవెంట్‌లో దేవరకొండ పట్టణానికి చెందిన వీరమళ్ల కృష్ణయ్య కుమార్తె గుండా సంతోషి, ఆమె బృందం వరల్డ్ రికార్డ్ కైవసం చేసుకుంది. ఏపీలోని విశాఖపట్టణానికి చెందిన మహిళ మనోవికాస్ అండ్ క్రియేషన్స్ ఆధ్వర్యంలో ఏటా నిర్వహించే క్రోచెట్ తయారీలో గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో చోటు దక్కించుకున్నారు గుండా సంతోషి. ఆ సంస్థ గతేడాది నవంబరు నుంచి ఈ ఏడాది ఆగస్టు వరకు మొత్తం 450 మందితో చిన్నారులు, యువతులు, వృద్ధులతో కలిసి అతి తక్కువ సమయంలో 58112 క్రోచెట్స్‌ను ప్రదర్శించడంతో ఈ రికార్డును దక్కించుకున్నారు. గిన్నిస్ రికార్డ్ లండన్ ప్రతినిధి స్వప్నిల్ డంగారికర్ పరిశీలించి ఈ రికార్డును ధ్రువీకరించారు.

ఆ కార్యాలయాలు మళ్లీ వచ్చేస్తున్నాయ్!

మిర్యాలగూడ, న్యూస్‌టుడే: ప్రాథమిక, మాధ్యమిక విద్యలను మరింత బలోపేతం చేసేందుకు, పాఠశాలల నిర్వహణపై పర్యవేక్షణ పెంచేందుకు ప్రభుత్వం జిల్లా ఉప విద్యాధికారి కార్యాలయాలను తిరిగి ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తుంది. 2014లో తెలంగాణ ఏర్పాటైన తరువాత అప్పటి ప్రభుత్వం 2015లో జిల్లా ఉప విద్యాధికారి కార్యాలయాలను ఎత్తివేసింది. మండల విద్యాధికారులే ఒకటి నుంచి పది తరగతుల వరకు పాఠశాలలను పర్యవేక్షించే ఏర్పాటు చేశారు. తెలంగాణలో 10 జిల్లాలను 33 జిల్లాలకు పెంచటంతో అదనంగా జిల్లాలకు 21 మంది డీఈవోలు, 28 మంది డిప్యూటీ ఈవోలు, 59 మంది ఎంఈవోలు, ఐదుగురు ఏడీలు అవసరమని ప్రతిపాదించారు. దీనిలో భాగంగా ఎంఈవోలను అన్ని మండలాలకు రెండు రోజుల క్రితం కేటాయించగా జిల్లా ఉపవిద్యాధికారి కార్యాలయాలను సైతం ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు సమాచారం.



మిర్యాలగూడలో ఖాళీగా ఉన్న జిల్లా ఉపవిద్యాధికారి కార్యాలయం

✦ ఉమ్మడి జిల్లాలో గతంలో ఐదు రెవెన్యూ డివిజన్ కేంద్రాల్లో జిల్లా ఉపవిద్యాధికారి పోస్టులు ఉండగా.. అదనంగా మూడు చోట్ల కోదాడ, హుజూర్‌నగర్, చౌటుప్పల్‌లో ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. అన్ని చోట్ల జిల్లా ఉప విద్యాధికారి పోస్టులు ప్రారంభమైతే ఒకటి నుంచి ఐదు తరగతుల వరకు ఎంఈవోలు, ఆరు నుంచి పదో తరగతి వరకు జిల్లా ఉపవిద్యాధికారులు పర్యవేక్షించనున్నారు.

ఉమ్మడి జిల్లాలో ఉపవిద్యాధికారి కార్యాలయాలు ఇవే:

- నల్గొండ జిల్లాలో.. మిర్యాలగూడ, నల్గొండ, దేవరకొండ
- సూర్యాపేట జిల్లాలో గతంలో ఉన్న సూర్యాపేట కార్యాలయం పునరుద్ధరించటంతో పాటు అదనంగా కోదాడ, హుజూర్‌నగర్.
- యాదాద్రి భువనగిరి జిల్లాలో గతంలో ఉన్న భువనగిరి కార్యాలయాన్ని పునరుద్ధరించటంతో పాటు.. చౌటుప్పల్

ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వస్తే ప్రారంభిస్తాం: భిక్షపతి, డీఈవో

జిల్లా ఉపవిద్యాధికారి కార్యాలయాలను ప్రారంభించమని ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వచ్చిన వెంటనే ప్రారంభిస్తాం. ప్రస్తుతం ఎంఈవో పోస్టులు పూర్తి స్థాయిలో భర్తీ చేశారు. అన్ని చోట్ల అధికారులు విధుల్లో చేరారు.

నల్గొండ

•నల్గొండ •మునుగోడు •నకిరేకల్

వర్షంతో పనులకు ఆటంకం

నల్గొండ గ్రామీణం, న్యూస్‌టుడే: అల్పపీడనంతో బుధవారం జిల్లా అంతటా వర్షం కురిసింది. పైరులో పత్తి తీసేందుకు అంతరాయం ఏర్పడింది. మూడు రోజులుగా వర్షాలు కురుస్తున్నాయి. జిల్లాలో అత్యధికంగా త్రిపురారం మండలం కామారెడ్డిగూడెంలో 129.8 మిల్లీమీటర్లు, దామరచర్ల మండలం తిమ్మాపురంలో 122.0 మి.మీ వర్షపాతం నమోదైంది. శాలిగౌరారంలో 95.5, అడవిదేవులపల్లి మండలం ముల్కలచెర్లలో 86.5, నార్కట్‌పల్లిలో 77.8 మి.మీ వర్షం కురిసింది. మిగతా మండలాల్లో ఓ మోస్తారు వర్షం పడింది.

యువత మత్తుకు దూరంగా ఉండాలి: ఎస్పీ



ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎస్పీ శరత్ చంద్ర పవార్

నల్గొండ అర్బన్, న్యూస్‌టుడే: జిల్లాలో యువత ఎట్టి పరిస్థితుల్లోనూ మత్తు వైపు వెళ్లకూడదని ఎస్పీ శరత్ చంద్ర పవార్ అన్నారు. జిల్లా కేంద్రంలోని వైద్య కళాశాలలో బుధవారం విద్యార్థులకు మాదక ద్రవ్యాల నిర్మూలనపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. మాదక ద్రవ్యాలు లేని జిల్లాగా మార్చేందుకు ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని తెలిపారు. ఒక్కసారి డ్రగ్స్, గంజాయి తాగి పట్టుబడితే ఆరు నెలల జైలు శిక్ష పడుతుందన్నారు. వైద్య విద్యార్థులంటే సమాజంలో మంచి గుర్తింపు ఉంటుందని దాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ రాములు నాయక్, డీఎస్పీ శివరాంరెడ్డి, డా.శివాణి, డా.అరుణకుమారి, డా.శివకుమార్, సీఐ డానియేల్, ఎస్సై నాగరాజు పాల్గొన్నారు.

➡ పోలీస్ వృత్తి నైపుణ్యాలపై డ్యూటీ మీట్ నిర్వహణ అవసరమని ఎస్పీ శరత్ చంద్ర పవార్ అన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో బుధవారం అధికారులు, సిబ్బంది వృత్తి నైపుణ్యాలపై నిర్వహించిన డ్యూటీ మీట్‌లో ఆయన పాల్గొని మాట్లాడారు. కేసుల దర్యాప్తు, ఫోరెన్సిక్ సైన్స్, ఫింగర్ ప్రిట్స్, ఫొటోగ్రఫి, డాగ్ స్క్వాడ్, బాంబు స్క్వాడ్ వంటి అంశాలపై పరీక్షలు నిర్వహించారు. విధి నిర్వాహణలో కేసుల దర్యాప్తు, నేర పరిశోధనలో మెళకువలు ఎంతగానో దోహదపడతాయని తెలిపారు. ఏఎస్పీ రాములు నాయక్, ఎస్బీ డీఎస్పీ రమేశ్, సీఐ రాఘవ రావు, వెంకటేశ్వర్లు, శ్రీను పాల్గొన్నారు.

రోడ్డు పనులు ప్రారంభం

మునుగోడు, న్యూస్‌టుడే: స్థానిక ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి ప్రత్యేక చొరవతో మండల పరిధిలోని కచిలపురం గ్రామం నుంచి నేరటోనిగూడెం గ్రామం వరకు బీటీ రోడ్డు నిర్మాణం కోసం రూ.2.40 కోట్ల నిధులు మంజూరయ్యాయి. ఆ పనులను మండల కాంగ్రెస్ నాయకులు బుధవారం ప్రారంభించారు. పోలగోని సత్యం, నన్నూరి విష్ణువర్ధన్‌రెడ్డి, పాల్వాయి చెన్నారెడ్డి, బీమనపల్లి సైదులు, పాలకూరి యాదయ్య, మాజీ సర్పంచి రామచంద్రం, రాంరెడ్డి పాల్గొన్నారు.

కార్యదర్శిపై ఫిర్యాదు

మర్రిగూడ: విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తూ.. అవినీతికి పాల్పడుతున్న కుదాబక్షుపల్లి పంచాయతీ కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలని ఆ గ్రామస్థులు కలెక్టర్‌కి, ఎంపీడీవో మునయ్యకి ఫిర్యాదు చేశారు. విధులకు సమయానికి రాకుండా, ఇబ్బందులకు గురిచేస్తూ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
80085 52710, 80085 66199
8008574421, 80085 74385

నల్గొండ జిల్లా పరిషత్తు, న్యూస్‌టుడే:

? పట్టణంలోని చైతన్యపురి కాలనీలో ఐఎంఏ పాఠశాల ఎదురుగా మురుగు కాల్వలు నిర్మించకపోవడంతో ఇళ్ల మధ్య మురుగు నీరు నిలిచి దుర్వాసన వ్యాపిస్తోంది. మురుగు నీరు నిల్వ లేకుండా దిగువకు పారే విధంగా చేయాలని జవాన్లకు చెప్పిన పట్టించుకోవడం లేదు. – కిరణ్ కుమార్, నల్గొండ.

✔ పరిశీలించి మురుగు నీరు నిల్వకుండా అవసరమైన చర్యలు తీసుకుంటాం.
– శ్రీనివాస్, శానిటరీ ఇన్‌స్పెక్టరు, నల్గొండ పురపాలిక

వానొస్తే తడి.. ఆరుబయటే బడి



పాఠశాల తరగతి గదులు తడిగా ఉండటంతో ఆరు బయటే కూర్చొని చదువుకుంటున్న విద్యార్థులు



శిథిలావస్థలో చండూరు ప్రాథమిక పాఠశాల (రేకుల షెడ్డు)

ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలని ప్రభుత్వం ఓ వైపు కృషి చేస్తున్నప్పటికీ.. క్షేత్రస్థాయిలో వసతులు లేక విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. చదువుకునే ఆసక్తి.. బోధించే ఉపాధ్యాయులున్నా.. సరైన భవనం, సౌకర్యాలు లేకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు.

చండూరు పురపాలికలోని ప్రాథమిక పాఠశాలకు భవనం లేక రేకుల షెడ్డులో నిర్వహిస్తున్నారు. పాఠశాలలో సుమారు 100 మంది విద్యనభ్యసిస్తుండగా.. నలుగురు ఉపాధ్యాయులు బోధిస్తున్నారు. ఆ రేకుల షెడ్డు సైతం శిథిలావస్థకు చేరి కూలిపోయే దశలో ఉండడంతో భయాందోళనలో బిక్కు బిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్నామని విద్యార్థులు, ఉపాధ్యాయులు వాపోతున్నారు. కొద్దిపాటి వర్షం కురిసిన మొత్తం తడిగా, ఎండ కాస్తే ఉక్కపోతతో విద్యార్థులు గదుల్లో కూర్చోలేని పరిస్థితి. పాఠశాలలో విద్యుత్తు, బెంచీలు కూడా లేకపోవడంతో కిందే కూర్చొని చదువుకోవాల్సిన దుస్థితి. గదులకు తలుపులు లేక రాత్రి వేళలో అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారింది. ఉన్నతాధికారులు స్పందించి బడికి కావాల్సిన వసతులు సమకూర్చాలని విద్యార్థుల తల్లితండ్రులు కోరుతున్నారు. దీనిపై పాఠశాల ప్రధానోపాధ్యాయుడు యాదగిరిని వివరణ కోరగా.. ఇప్పటికే మండల, జిల్లా విద్యాధికారి దృష్టికి తీసుకెళ్లామని, సమస్య పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపినట్లు ఆయన వివరించారు.

– న్యూస్‌టుడే, చండూరు

నాన్న ఊపిరి తీయాలనుకుంటే.. పెదనాన్న ప్రాణం పోశాడు



చిన్నారి ఇందుమతి

నిమ్స్, న్యూస్‌టుడే: కంటికి రెప్పలా కాపాడుకోవాల్సిన నాన్నే నాలుగేళ్ల క్రితం ఆ చిన్నారి ఊపిరి తీయాలనుకున్నాడు. ఈ క్రమంలో తీవ్ర గాయాలై కొన ఊపిరితో బయటపడింది. కుటుంబీకులు ఆమెను ఆస్పత్రిలో చేర్పించి ప్రాణాల్ని దక్కించుకున్నారు. ఇంతలో మరో సమస్య వచ్చింది. ఆ చిన్నారికి గుండెలో రెండు రంధ్రాలున్నట్లు తేలడంతో పలు ప్రైవేటు ఆస్పత్రులకు తీసుకెళ్లారు. పెద్ద మొత్తంలో ఖర్చు పెట్టలేని పరిస్థితితో మిన్నకుండిపోయారు. ఇప్పుడు ఆ చిన్నారికి పంజాగుట్ట నిమ్స్ ఆస్పత్రిలో గుండె శస్త్ర చికిత్స ఉచితంగా చేయడంతో సంరక్షిస్తున్న పెదనాన్న, ఇతర కుటుంబీకులు ఆనందంతో పొంగిపోతున్నారు.

☛ నల్గొండ జిల్లా నాంపల్లి మండలం రాందాస్ తండాకు చెందిన మెఘావత్ మధు నాలుగేళ్ల క్రితం భార్యపై అనుమానంతో ఆమెను హత్య చేసి, ఆరేళ్ల కూతురు ఇందుమతిపైనా దాడి చేసి, ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అప్పట్లో స్థానికులు, ఇతర కుటుంబీకులు చిన్నారిని రక్షించారు. నెలన్నర పాటు ఉస్మానియా ఆస్పత్రిలో చికిత్స చేయించారు. తర్వాత చిన్నారి సంరక్షణ బాధ్యత పెదనాన్న తీసుకున్నాడు. ఇరవై రోజుల క్రితం చిన్నారికి తీవ్ర జ్వరం రావడంతో నగరంలోని నిలోఫర్ ఆస్పత్రికి తీసుకొచ్చారు. రెండు రోజులు గడిచిన తర్వాత గుండెకు రెండు రంధ్రాలు ఉన్నట్లు వైద్యులు గుర్తించారు. నిమ్స్‌లో ఉచితంగా బ్రిటన్ బృందం గుండె ఆపరేషన్లు చేస్తున్న విషయం తెలుసుకొని పేరును నమోదు చేయించారు. బుధవారం ఇందుమతికి గుండె చికిత్స విజయవంతంగా పూర్తయినట్లు కార్డియోథొరాసిక్ విభాగాధిపతి అమరేశ్వరరావు చెప్పారు.

విద్యుత్తు సరఫరాలో నేడు అంతరాయం

నల్గొండ జిల్లా పరిషత్తు: పట్టణంలో పలు ప్రాంతాల్లో గురువారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు విద్యుత్తు సరఫరా నిలిపి వేస్తున్నట్లు విద్యుత్తు సంస్థ ఏడీఈ నవీద్ అహ్మద్ బుధవారం తెలిపారు. విద్యుత్తు తీగల మరమ్మతుల కారణంగా రహమాన్‌బాగ్, శ్రీనగర్, పరిసరాల ప్రాంతాల్లో జరిగే విద్యుత్తు సరఫరా అంతరాయానికి వినియోగదారులు సహకరించాలని కోరారు.

ప్రభుత్వ బాలుర కళాశాలలో శ్రమదానం

నల్గొండ టౌన్, న్యూస్‌టుడే: నల్గొండ పట్టణం కోమటిరెడ్డి ప్రతీక్ మెమోరియల్ ప్రభుత్వ బాలుర కళాశాలలో బుధవారం స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమం నిర్వహించారు. కళాశాల ప్రాంగణంలో అధ్యాపకులు, విద్యార్థులు శ్రమదాన పనులు చేశారు. కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ దనమ్మ, ఎన్ఎస్ఎస్ అధికారి విక్రమ్‌బాబు, ఎన్ఎస్ఎస్ అధికారులు దశరథ, యాదయ్య, మురళి, కోటేశ్వర రాజు, జిల్లా నరసింహ, శివకోటి పాల్గొన్నారు.

చిట్యాల: స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమంలో భాగంగా చిట్యాలలో బుధవారం విద్యార్థులతో ప్రదర్శన నిర్వహించారు. విద్యార్థులతో పోలీస్ స్టేషన్ కూడలిలో మానవహారం ఏర్పాటు చేశారు. దుకాణాదారుల వద్దకు వెళ్లి స్వచ్ఛతపై పుర సిబ్బంది, ఠాగూర్ విద్యాలయం అవగాహన కల్పించారు. పుర పాలిక శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రవణ్‌కుమార్, ప్రిన్సిపల్ నరేందర్ పాల్గొన్నారు.



చిట్యాలలో ప్రదర్శన నిర్వహిస్తున్న విద్యార్థులు

27న కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి

నల్గొండ సంక్షేమం, న్యూస్‌టుడే: ఈనెల 27న కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతిని రాష్ట్ర వేడుకగా నిర్వహించనున్నట్లు జిల్లా బీసీ సంక్షేమ శాఖాధికారి రమేష్ తెలిపారు. ఉదయం 10 గంటలకు జిల్లా కేంద్రంలోని హైదరాబాద్ రోడ్డు పాత కేంద్రం రైల్వే ట్రాక్ వద్ద వేడుకలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు ఈ కార్యక్రమానికి హాజరుకావాలన్నారని తెలిపారు.

కుటుంబ నిర్ధారణ చేయించుకోవాలి

కనగల్, న్యూస్‌టుడే: అర్హతలు ఉండి రేషన్ కార్డు లేకపోవడంతో పాటు వివిధ కారణాలతో రూ.2 లక్షల లోపు రుణమాఫీకి మండల వ్యాప్తంగా 298 మంది వివరాలు నమోదు చేయాల్సి ఉందని ఏవో బి.అమరేందర్‌గౌడ్ తెలిపారు. ఒంటరి మహిళలు, వితంతువులు, వివిధ కారణాలతో పెండింగ్‌లో ఉన్న రైతులు వెంటనే పట్టా పాసు పుస్తకం, భార్యాభర్తల ఆధార్ కార్డు నకలు కాపీలతో ఏఈవోలను లేదా మండల వ్యవసాయ అధికారి కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

పండిత్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జయంతి



నల్గొండ: దీన్‌దయాళ్ విగ్రహానికి నివాళి అర్పిస్తున్న నాగం వర్షిత్‌రెడ్డి, తదితరులు

నల్గొండ విద్యావిభాగం, న్యూస్‌టుడే: పండిత్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ జయంతిని పురస్కరించుకుని డవలప్‌మెంట్ అండ్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆఫ్ ది బ్లైండ్ ఆధ్వర్యంలో బుధవారం నల్గొండలోని దీన్‌దయాళ్ నగర్ సూరదాస్ భవన్‌లో ఆయన విగ్రహం వద్ద నివాళి అర్పించారు. భాజపా జిల్లా అధ్యక్షులు నాగం వర్షిత్‌రెడ్డి, డ్వాబ్ ప్రధాన కార్యదర్శి పొనుగోటి చొక్కారావు, దామోదర్‌రావు, అరోరా పాఠశాల వ్యవహర్త వెంకట్‌రెడ్డి ఉన్నారు.

నీలగిరి: పండిత్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జయంతి సందర్భంగా బుధవారం భాజపా కార్యాలయంలోని ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. భాజపా జిల్లా అధ్యక్షుడు డాక్టర్ నాగం వర్షిత్‌రెడ్డి, నాయకులు ముత్యాల్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, విద్యాసాగర్‌రెడ్డి, భూపాల్‌రెడ్డి, నర్సింహారెడ్డి, లింగస్వామి, మహేశ్ పాల్గొన్నారు.

నల్గొండ గ్రామీణం: వెల్లుపల్లిలో పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ జయంతిని బుధవారం భాజపా నాయకులు నిర్వహించారు. భాజపా నాయకుడు సాంబయ్య, నవీన్, శంకర్, వెంకన్న పాల్గొన్నారు.

పోటీ పరీక్షలతో ప్రతిభ మెరుగు



విద్యార్థులకు అభ్యసన సామగ్రి అందజేస్తున్న డీఎస్‌వో వెంకటేశ్వర్లు, తదితరులు

నల్గొండ విద్యావిభాగం: నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్ఎంఎంఎస్) పోటీ పరీక్ష రాయడం వల్ల విద్యార్థుల్లో ప్రతిభ మెరుగుపడుతుందని జడ్పీ సీఈవో ప్రేమ్ కరణ్‌రెడ్డి తెలిపారు. నల్గొండ మండలం దోమలపల్లి జి.ప.ఉ.పా లలో పల్‌రెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో పల్‌టెక్ స్కూల్ కిట్స్ డిస్ట్రిబ్యూషన్‌లో భాగంగా 8వ తరగతి విద్యార్థులకు ఎన్ఎంఎంఎస్ అభ్యసన సామగ్రి పంపిణీ చేశారు. హెచ్ఎం కొమ్ము శ్రీనివాస్, డీఎస్‌వో వెంకటేశ్వర్లు, పల్‌రెడ్డి ఫౌండేషన్ ఛైర్మన్ పల్‌రెడ్డి రాంరెడ్డి, రాంబాబు పాల్గొన్నారు.

శాలిగౌరారం: విద్యార్థులు పట్టుదలతో చదివి మంచి ఉద్యోగాలను సాధించి, పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలని జడ్పీ సీఈవో ప్రేమ్‌కరణ్‌రెడ్డి అన్నారు. వల్లాల ఆదర్శ పాఠశాలలో పల్‌రెడ్డి ఫౌండేషన్ బాధ్యులు పల్‌రెడ్డి రాంరెడ్డి విద్యార్థులకు ఎన్ఎంఎంఎస్‌కు సంబంధించిన స్టడీ మెటీరియల్‌ను విద్యార్థులకు ఉచితంగా అందజేశారు. ట్రాన్స్‌కో డీఈ వెంకటేశ్వర్లు, ప్రిన్సిపల్ సంధ్యారాణి, ఎంపీడీవో జ్యోతిలక్ష్మి, ట్రాన్స్‌కో ఏఈ శ్రీధర్ పాల్గొన్నారు

ప్రజారోగ్య జీవితంలో ఫార్మసిస్టుల పాత్ర కీలకం

నల్గొండ అర్బన్, న్యూస్‌టుడే: ప్రజారోగ్య జీవితంలో ఫార్మసిస్టుల పాత్ర కీలకమని అదనపు కలెక్టర్ పూర్ణచంద్ర అన్నారు. ప్రపంచ ఫార్మసిస్టుల దినోత్సవం పురస్కరించుకుని బుధవారం జిల్లా కేంద్రంలోని గడియారం సెంటర్ నుంచి డీఎంహెచ్‌వో కార్యాలయం వరకు నిర్వహించిన ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వృత్తిలో నిబద్ధత పాటించి ప్రజలకు నాణ్యమైన సేవలు అందించాలని సూచించారు. డీఎంహెచ్‌వో పుట్ల శ్రీనివాస్, డీటీసీవో కల్యాణ్ చక్రవర్తి, ప్రోగ్రాం అధికారులు కృష్ణకుమారి, అరుంధతి, కే.రవి, పద్మ, దుర్గయ్య పాల్గొన్నారు.

పురపాలిక కార్మికులను క్రమబద్ధీకరించాలని ధర్నా

నల్గొండ కలెక్టరేట్, న్యూస్‌టుడే: పురపాలికల కార్మికులను క్రమబద్ధీకరించాలని బుధవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయు రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుమ్మల వీరారెడ్డి మాట్లాడుతూ పురపాలికల్లో పని చేస్తున్న పొరుగు సేవ, ఒప్పంద, దినసరి వేతన కార్మికులను క్రమబద్ధీకరించి కనీస వేతనం చెల్లించాలన్నారు. ఉద్యోగ విరమణ సమయంలో ప్రభుత్వం కల్పించే సౌకర్యాలు అమలు చేయాలని కోరారు. సైదులు, సత్తయ్య, నగేష్, పెరికృష్ణ, సైదులు, వెంకటయ్య, రాములు, ఆండాలు, రజిత, కృష్ణవేణి, పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న పురపాలిక కార్మికులు



మాట్లాడుతున్న మిషన్ భగీరథ సీఈ చెన్నారెడ్డి

మంచినీటి సరఫరాకు సమస్యలు రాకుండా చూడాలి

నల్గొండ గ్రామీణం, న్యూస్‌టుడే: గ్రామాల్లో మంచినీటి సరఫరాకు ఎలాంటి సమస్యలు రాకుండా చూసుకోవాలని పంచాయతీ మల్టీపర్పస్ సిబ్బందికి మిషన్ భగీరథ సీఈ చెన్నారెడ్డి సూచించారు. నల్గొండ ఎంపీడీవో కార్యాలయంలో నల్గొండ, తిప్పర్తి మండలాలకు సంబంధించి బుధవారం రెండో శిక్షణ కార్యక్రమంలో ట్యాంకుల శుభ్రత, క్లోరినేషన్, పైప్‌లైన్ల మరమ్మతుల గురించి వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో నీటిని సక్రమంగా సరఫరా చేయాలని తెలిపారు. ఎస్ఈ వెంకటేశ్వర్లు, ఈఈ శాంతి కుమారి, డీఈఈ సంపత్, ఏఈ షఫిముద్దిన్ తదితరులు పాల్గొన్నారు.

గొలుసు దుకాణాలు నిర్వహిస్తే చర్యలు

మర్రిగూడ, న్యూస్‌టుడే: గ్రామాల్లో గొలుసు దుకాణాలు నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని నాంపల్లి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ నవీన్‌కుమార్ హెచ్చరించారు. మండల కేంద్రంలోని పోలీసుస్టేషన్‌లో గొలుసు దుకాణాల నిర్వాహకులతో నిర్వహించిన సమావేశంలో ఎస్సై రంగారెడ్డితో కలిసి పలు సూచనలు చేశారు. వివిధ గ్రామాల ప్రజలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీఐ నవీన్ కుమార్



నకిరేకల్: కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే వేముల వీరేశం, పుర ఇన్‌ఛార్జి ఛైర్‌పర్సన్ ఉమారాణి

మహిళా సంక్షేమానికి కృషి: ఎమ్మెల్యే వీరేశం

నకిరేకల్, న్యూస్‌టుడే: మహిళా సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేకంగా కృషి చేస్తోందని ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. స్థానిక సాయిమందిర కల్యాణ మండపంలో నకిరేకల్, చిట్యాల మండలాలకు చెందిన 59 మంది లబ్ధిదారులకు రూ.59.09 లక్షల విలువైన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను బుధవారం పంపిణీ చేసి మాట్లాడారు. నిరుపేద కుటుంబాలకు సీఎం రేవంత్‌రెడ్డి అమలుచేస్తున్న పథకాలు వరమన్నారు. కార్యక్రమంలో పుర ఇన్‌ఛార్జి ఛైర్‌పర్సన్ మురారిశెట్టి ఉమారాణి, తహసీల్దారు జమీరోద్దిన్, పీఏసీఎస్ ఛైర్మన్ వెంకటేశ్వరరావు, టీపీసీసీ ప్రతినిధి ఏసుపాదం, మహిళా కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుకన్య పాల్గొన్నారు.

ఎంఈవోలు వచ్చేశారు..!

కేతేపల్లి, న్యూస్‌టుడే: మండల విద్యాధికారిగా ఎ.రాజేంద్రప్రసాద్ బుధవారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం ఆయన చెరుకుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. ఇప్పటివరకు ఇక్కడ పనిచేసిన ఎంఈవో నాగయ్య నకిరేకల్ మండలానికి బదిలీ అయ్యారు.

శాలిగౌరారం: శాలిగౌరారం నూతన ఎంఈవోగా మండలంలోని పెర్కకొండారంలో జీహెచ్ఎంగా విధులు నిర్వహిస్తున్న మందుల సైదులు బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ ఎంఈవోగా పని చేసి నాగయ్య నకిరేకల్ ఎంఈవోగానే కొనసాతున్నారు.

చిట్యాల: మండల విద్యాధికారిగా పానుగోత్ సైదానాయక్ నియమితులయ్యారు. ఈ మేరకు ఆయన బుధవారం చిట్యాలలో బాధ్యతలు స్వీకరించారు. పీఆర్‌టీయూ టీఎస్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కంచర్లకుంట్ల సుధాకర్‌రెడ్డి, కోమటిరెడ్డి శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో ఆయనకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో చిట్యాల, గుండ్రాంపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు కరుణాకర్ రెడ్డి, ఆ సంఘం మండల గౌరవాధ్యక్షుడు బాదం భిక్షపతి, పాల్గొన్నారు.

చండూరు: చండూరు మండల విద్యాధికారిగా సుధాకర్‌రెడ్డి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన మండలంలోని బొడంగిపర్తి ఉన్నత పాఠశాలలో గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుడిగా పనిచేశారు. పీఆర్‌టీయూ మండల అధ్యక్ష, కార్యదర్శులు ఎడ్ల భిక్షం, మాధగోని వెంకటేశ్వర్లు, పలువురు ఉపాధ్యాయులు ఆయనను సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఉపాధ్యాయులు నర్సింహరావు, పి.యాదయ్య, డి.మధుమోహన్, వెంకట్‌రెడ్డి, యాదగిరి, చౌకిసింగ్, భాస్కర్, పాల్గొన్నారు.

గట్టుప్పల: మండలం తొలి ఇన్‌ఛార్జి మండల విద్యాధికారిగా అమృతాదేవిని నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రస్తుతం ప్రధానోపాధ్యాయులుగా విధులు నిర్వహిస్తున్నారు. మండల పరిధిలోని ఉపాధ్యాయులు, మండల నాయకులు, విద్యార్థులు, ప్రముఖులు శుభాకాంక్షలు తెలిపారు.

మునుగోడు: స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులుగా విధులు నిర్వర్తిస్తున్న కత్తుల రవీందర్‌ను మండల విద్యాధికారిగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు స్థానికంగా ఉన్న మండల విద్యా వనరుల కేంద్రంలో బుధవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు.

సినిమాలు

నల్గొండ కల్చరల్, నకిరేకల్, న్యూస్‌టుడే

నల్గొండ: **పీవీఎన్:** చిక్లెట్స్
నటరాజ్: బొమ్మరిల్లు, **వెంకటేశ్వర:** మత్తు వదలరా 2
నకిరేకల్: **రామకృష్ణ-** హైడ్-న్-సీక్ **వెంకటేశ్వర-** మత్తు వదలరా 2

ముగిసిన సీబీఎస్ఈ క్లస్టర్ ఖోఖో టోర్నమెంట్



అండర్-19 బాలుర విభాగంలో విజేతలు, చిత్రంలో వీఆర్ఎస్ విజ్ఞాన జ్యోతి పాఠశాల ట్రస్టీ సభ్యురాలు రమణశ్రీ, తదితరులు

నిజాంపేట, న్యూస్‌టుడే: హైదరాబాద్ బాచుపల్లిలోని వీఆర్ఎస్ విజ్ఞాన జ్యోతి రెసిడెన్షియల్ పాఠశాలలో నాలుగు రోజులుగా జరిగిన సీబీఎస్ఈ క్లస్టర్ 7వ ఖోఖో టోర్నమెంట్ పోటీలు బుధవారం ముగిశాయి. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన 200 సీబీఎస్ఈ పాఠశాలల నుంచి 5,500 మంది క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. అండర్-14, 17, 19 విభాగాల్లో బాల బాలికలకు వేర్వేరు పోటీలను నిర్వహించారు. విజేతలుగా నిలిచిన 12 జట్లకు బుధవారం బహుమతుల ప్రదానం జరిగింది. ఒక్కో విభాగంలో బంగారు, రజత, కాంస్య, ప్రోత్సాహక పతకాలతో పాటు ట్రోఫీలను అందజేశారు. వీఆర్ఎస్ విజ్ఞానజ్యోతి విద్యా సంస్థల మేనేజింగ్ ట్రస్టీ వల్లూరుపల్లి రమణశ్రీ, ట్రస్టీ మేనేజర్ శాయాజీరావు, డైరెక్టర్ కొడాలి విజయారాణి, వీఎన్ఆర్ విజ్ఞానజ్యోతి కళాశాలల క్రీడా విభాగం ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ జి.శ్రీరామ తదితరులు పాల్గొన్నారు.

విజేతలు వీరే: అండర్–14 బాలికలు: హిల్స్ పాఠశాల (తోటపల్లి, ఏలూరు జిల్లా), నల్గొండ పబ్లిక్ స్కూల్ (నల్గొండ పట్టణం), శ్రీ ప్రకాష్ విద్యానికేతన్ (అనకాపల్లి, విశాఖపట్నం), సిస్టర్ స్టానిస్లాస్ (కర్నూలు పట్టణం).

బాలురు: శ్రీ ప్రకాష్ విద్యానికేతన్ (అనకాపల్లి, విశాఖపట్నం), నల్గొండ పబ్లిక్ స్కూల్ (నల్గొండ పట్టణం), హిల్స్ పాఠశాల (తోటపల్లి, ఏలూరు జిల్లా), ఏకశిలా ఐఎస్ పాఠశాల (వరంగల్).

అప్ ఇప్

ప్రజా సమస్యలపై పోరాటం.. కనగల్: సీపీఎం ఆధ్వర్యంలో పోరాటాలు నిర్వహిస్తామని జిల్లా కార్యదర్శి వర్గ సభ్యురాలు పాలడుగు ప్రభావతి అన్నారు. కనగల్‌లో బుధవారం నిర్వహించిన గ్రామ శాఖ సమావేశంలో ఆమె మాట్లాడారు. కానుగు లింగస్వామి, ఎండీ అక్రమ్, సుత్తానా, రాంబాబు పాల్గొన్నారు.


పుర కమిషనర్‌ను సస్పెండ్ చేయాలి.. నల్గొండ సంక్షేమం: చిట్యాల పుర పాలకవర్గానికి సంబంధం లేకుండా కొంత మందికే జీతాలు పెంచిన పుర కమిషనర్‌ను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేస్తూ ప్రజా పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు నూనె వెంకట స్వామి అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్‌కు బుధవారం విజ్ఞప్తి చేశారు. వరికల్ గోపాల్ ప్రజాపతి, మారగోని శ్రీనివాస్‌గౌడ్, లింగస్వామి గౌడ్, యాదయ్య పాల్గొన్నారు.

కమిటీ ఎన్నిక.. మర్రిగూడ: మండల పరిధిలోని తమ్మడపల్లి గ్రామంలో ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి ఆదేశాలతో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు రాందాస్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో గొలుసుదుకాణాల నిర్మూలనకు కమిటీని ఎన్నుకున్నారు. అనంతరం గ్రామస్థులతో ర్యాలీ నిర్వహించారు. ఎస్సై రంగారెడ్డి, రమేష్, వెంకటేష్, జంగయ్య ఉన్నారు.

చెరువులు నింపడమే లక్ష్యం.. మాడ్గులపల్లి: చెరువులను నింపి రైతులను ఆదుకోవటమే ప్రభుత్వ లక్ష్యమని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గడ్డం వేణుగోపాల్‌రెడ్డి అన్నారు. మాడ్గులపల్లిలో బుధవారం ఆయన మాట్లాడారు. ఎంపీటీసీ మాజీ సభ్యుడు షఫీ, యాదయ్య, కల్లు శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

అందజేత.. కట్టంగూరు: సాందీపని పాఠశాల ఛైర్మన్ కె.బాల ప్రదీప్ వర్ధంతి ఆ పాఠశాలలో 2005-06 బ్యాచ్ పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థులు రూ.30 వేల విలువైన బెంచీలు ఆ పాఠశాలకు బుధవారం అందజేశారు. కన్మూరి హేమలత, నాగరాజు, శంకర్, వేణు, వెంకటేశ్ పాల్గొన్నారు

వల్లాల వాసికి ఓయూ డాక్టరేట్.. నల్గొండ టౌన్: నల్గొండ జిల్లా శాలిగౌరారం మండలం వల్లాల గ్రామానికి చెందిన **గుండ్లపల్లి సుధాకర్** ఓయూ జియాలజీ విభాగం నుంచి డాక్టరేట్ అందుకున్నారు. నిరుపేద కుటుంబానికి చెందిన సుధాకర్ ప్రభుత్వ విద్యా సంస్థల్లోనే పాఠశాల, కళాశాల స్థాయి విద్య పూర్తి చేశాడు. ప్రస్తుతం మహాత్మాగాంధీ విశ్వవిద్యాలయంలో అధ్యాపకుడిగా పని చేస్తున్నాడు. డాక్టరేట్ సాధించిన ఈ యువకుడిని బుధవారం వర్సిటీ రిజిస్ట్రార్ అల్వాల రవి, అధ్యాపకులు అభినందించారు.



నేడు చాకలి ఐలమ్మ జయంతి.. నల్గొండ సంక్షేమం, న్యూస్‌టుడే: వీరనారి చాకలి ఐలమ్మ జయంతిని గురువారం నల్గొండలో ఘనంగా నిర్వహిస్తున్నట్లు జిల్లా బీసీ సంక్షేమ శాఖాధికారి రమేష్ తెలిపారు. ఉదయం 10 గంటలకు జిల్లా కేంద్రంలోని సాగర్ రోడ్డులో ఉన్న చాకలి కమ్యూనిటీ హాల్‌లో నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

శ్రీలంక ప్రజలకు జేజేలు.. గట్టుప్పల: శ్రీలంకలో కమ్యూనిస్టులకు అఖండ మెజార్టీ చేకూర్చి అధికారంలోకి తీసుకొచ్చిన అక్కడి ప్రజలకు ధన్యవాదాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల పరిధిలోని వెల్మకన్నే గ్రామంలో గ్రామ శాఖ 21వ మహాసభలకు ఆయన హాజరై మాట్లాడారు. జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు బండ శ్రీశైలం, చాపల మారయ్య, మండల కార్యదర్శి మల్లేశం, ధనంజయ్యగౌడ్ ఉన్నారు.

వినతి.. కట్టంగూరు: పదవీ విరమణ వయస్సుకు దగ్గరగా ఉన్న పూర్వ గ్రామ రెవెన్యూ సహాయకుల వారసులకు ఉద్యోగాలివ్వాలని తహసీల్దార్ ప్రసాద్‌కు బుధవారం వినతి పత్రం అందజేశారు. వెంకన్న, నర్సింహ, లింగయ్య ఉన్నారు.

విజయవంతం చేయండి.. నార్కట్‌పల్లి గ్రామీణం: తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఆధ్వర్యంలో ఈనెల 27న సికింద్రాబాద్‌లోని హరిహర కళా వేదికలో జరిగే ఉద్యమకారుల ఘన సన్మానాన్ని విజయవంతం చేయాలని నల్గొండ జిల్లా టీయూఎఫ్ అధ్యక్షుడు శ్రీనివాస్, కన్వీనర్ అంతటి రవి కోరారు. నార్కట్‌పల్లిలో బుధవారం మాట్లాడారు. దాసు, సైదులు, వెంకన్న, నరేశ్ పాల్గొన్నారు.

అవగాహన.. నకిరేకల్: కల్లుగీత కార్మికులు చెట్లు ఎక్కేందుకు భద్రతా మోకులపై నకిరేకల్‌లో అవగాహన కల్పించామని స్థానిక ఎక్సైజ్ సీఐ మల్లయ్య బుధవారం తెలిపారు. సంజీవ, జానయ్యగౌడ్, వెంకట్‌గౌడ్, వెంకటేశ్వర్లు గౌడ్ పాల్గొన్నారు.

జోరు వర్షం.. పంటలు ఆగం

శాలిగౌరారం మండలంలో గత రెండు రోజులుగా కురుస్తున్న జోరు వర్షాలకు రైతుల పంటలు ఆగమయ్యాయి. కొందరి రైతుల భూముల్లో ఇసుక మేటలు వేశాయి. మరికొంత మంది పొలాలు నేలవాలడంతో అన్నదాతలు ఆందోళనలో ఉన్నారు. వర్షాలకు మూసీ ఏరు ఉద్ధృతి పెరగడంతో శాలిగౌరారం ప్రాజెక్టులోకి వరద నీరు చేరుతుంది. – శాలిగౌరారం, న్యూస్‌టుడే



వరి పొలంలో పేరుకుపోయిన ఇసుక మేటలు

ఉపాధ్యాయుల నిరసన

మర్రిగూడ, న్యూస్‌టుడే: ఉపాధ్యాయుల క్రమబద్ధీకరణ జీవో 25ను ప్రభుత్వం వెంటనే సవరించాలని ఉపాధ్యాయ సంఘాల ఐక్య కార్యచరణ సమితి ఆధ్వర్యంలో బుధవారం కాంప్లెక్స్ సమావేశం నిర్వహించారు. మధ్యాహ్న భోజన సమయంలో ఉపాధ్యాయులందరూ నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. పీఆర్‌టీయూ రాష్ట్ర నాయకుడు నాగయ్య, ఎస్సీ ఎస్టీ ఉపాధ్యాయ సంఘం జిల్లా నాయకుడు లచ్చిరాం, వెంకటరెడ్డి, బాలరాజు, శ్రీనివాసరావు, కృష్ణయ్య, రమణ, శ్రీశైలం, నాగేంద్రమ్మ, శ్రీనివాస్, యాదయ్య తదితరులున్నారు.

అభ్యంతరాలు తెలపాలి

నల్గొండ విద్యావిభాగం, న్యూస్‌టుడే: జిల్లాలోని కేజీబీవీలు, అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ప్రత్యేకాధికారులు, పీజీసీఆర్‌టీలు, సీఆర్‌టీలు, పీఈటీ పోస్టులకు జనరల్ మెరిట్ జాబితా నుంచి సబ్జెక్టు వారిగా 1:1నిష్పత్తిలో ఎంపికైన అభ్యర్థుల్లో అభ్యంతరాలు ఉంటే గురువారం మధ్యాహ్నం 12 గంటల లోపు ఆధారాలతో జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో సమర్పించాలని డీఈవో బి.భిక్షపతి తెలిపారు. ఎంపికైన అభ్యర్థుల జాబితా డీఈవో నల్గొండ వెబ్‌సైట్‌లో పొందుపరిచినట్లు పేర్కొన్నారు.

మిర్యాలగూడ

●మిర్యాలగూడ ●నాగార్జునసాగర్ ●దేవరకొండ

కాంగ్రెస్ నుంచి సస్పెన్షన్

గుర్రంపోడు, న్యూస్‌టుడే: కాంగ్రెస్ పార్టీలో వ్యతిరేక కార్యకలాపాలు నిర్వహిస్తున్న ఇద్దరు నాయకులను పార్టీ నుంచి సస్పెండ్ చేసినట్లు మండల అధ్యక్షుడు తగుల్ల సర్వయ్య ప్రకటించారు. బుధవారం గుర్రంపోడులో పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ కొప్పోలుకు చెందిన మాజీ సింగిల్‌విండో ఛైర్మన్ ఆవుల వెంకన్న, మొసంగి గ్రామానికి చెందిన నిర్మనమెట్ల బాలయ్యలు గత కొంతకాలంగా పార్టీ ప్రతిష్ఠకు భంగం కలిగేలా వ్యవహరిస్తూ పార్టీ నియమావళికి వ్యతిరేకంగా పనిచేస్తున్నందున వారిని పార్టీ నుంచి తొలగిస్తూ ఉత్తర్వులు జారీచేసినట్లు పేర్కొన్నారు. జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి వెంకటేశ్వర్‌రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి జగదీశ్వర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు వెలుగయాదయ్య, ఎస్సీసెల్ అధ్యక్షుడు వెంకన్న పాల్గొన్నారు.

'స్థానిక' ఎన్నికల్లో సత్తా చాటాలి

చందంపేట, న్యూస్‌టుడే: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతి గ్రామంలో కాంగ్రెస్ పార్టీ సత్తా చాటేలా కార్యకర్తలు కృషి చేయాలని పీఏసీఎస్ ఛైర్మన్ జాల నర్సింహారెడ్డి కోరారు. చిత్రియాలకి చెందిన వివిధ పార్టీల కార్యకర్తలు ఆయన సమక్షంలో బుధవారం పార్టీలో చేరారు.

మిర్యాలగూడ పట్టణం, న్యూస్‌టుడే:

? సమస్య: పట్టణంలోని చర్చి రహదారిలో తరచూ ట్రాఫిక్ జామ్ అవుతూ అనేక అవస్థలు పడుతున్నాం.
– గోవర్దన్, మిర్యాలగూడ

✔ సమాధానం: ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు తీసుకుంటాం.
– మోహన్, ట్రాఫిక్ ఎస్సై, మిర్యాలగూడ

హాలియా, న్యూస్‌టుడే

? సమస్య: అనుముల మండలం మారేపల్లి గ్రామంలోని ఎస్సీ కాలనీలో మిషన్‌భగీరథ తాగునీరు సక్రమంగా రావడం లేదు.
– క్రాంతి, మారేపల్లి

✔ సమాధానం: సమస్యను పరిశీలించి పరిష్కరిస్తాం.
– సుజాత, ఎంపీడీవో, అనుముల మండలం

ఎంఈవోలు వచ్చేశారు..!

జిల్లా విద్యాశాఖ మంగళవారం జారీ చేసిన ఉత్తర్వుల మేరకు మిర్యాలగూడ, నాగార్జునసాగర్, దేవరకొండ నియోజకవర్గాల్లో బుధవారం పలు మండలాల్లోని పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయులుగా పనిచేస్తున్న వారు ఎంఈవోలుగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ సంఘాలు వీరిని ఘనంగా సన్మానించాయి. ఎంఈవోలుగా బాధ్యతలు స్వీకరించిన వారి వివరాలు ఈ విధంగా ఉన్నాయి..

పేరు	మండలం	పనిచేసిన స్థలం
లావూరి బాలు నాయక్	మిర్యాలగూడ	జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, యాద్గార్‌పల్లి
వెంకటమ్మ	మాడ్గులపల్లి	ప్రభుత్వ ఉన్నత పాఠశాల, మాడ్గులపల్లి
లావూరి వెంకన్ననాయక్	నిడమనూరు	జడ్పీ ఉన్నత పాఠశాల, తుమ్మడం
రమావత్ రవి	త్రిపురారం	జడ్పీ ఉన్నత పాఠశాల, పెద్దదేవులపల్లి
నిరుడు అంజయ్య	చింతపల్లి	ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ఘడియగౌరారం
నాగేశ్వరరావు	కొండమల్లేపల్లి	జడ్పీ ఉన్నత పాఠశాల, కొండమల్లేపల్లి
కె. చందర్‌నాయక్	చందంపేట	ప్రభుత్వ ఉన్నత పాఠశాల, చందంపేట
రఘు	నేరేడుగొమ్ము	ప్రభుత్వ ఉన్నత పాఠశాల, పెద్దమునగల్
ఇస్లావత్ గోప్యానాయక్	డిండి	జడ్పీ ఉన్నత పాఠశాల, చెరుకుపల్లి
ఎ. వెంకటయ్య	పెద్దఅడిశర్లపల్లి	జడ్పీ ఉన్నత పాఠశాల, పీఏపల్లి
ఎస్. శ్రీనయ్య	గుడిపల్లి	జడ్పీ ఉన్నత పాఠశాల, గుడిపల్లి

– న్యూస్‌టుడే, బృందం

అసంపూర్తి నిర్మాణం.. అవస్థలమయం



నల్గొండ ప్రధాన రహదారి విస్తరించి పార్కింగ్ రాళ్లు అమర్చని తీరు

మిర్యాలగూడ పట్టణంలోని నల్గొండ ప్రధాన రహదారి విస్తరణ పనులు పలుచోట్ల అసంపూర్తిగా వదిలేయటంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాజీవ్ కూడలి నుంచి అద్దంకి రహదారి బైజంక్షన్ వరకు రెండు వైపులా రహదారిని వంద అడుగుల మేరకు విస్తరించారు. రహదారి విస్తరించిన తరువాత చివరి భాగంలో పార్కింగ్ రాళ్లను అమర్చాల్సి ఉంది. కొన్ని ప్రాంతాల్లో వీటిని అమర్చపోవటంతో కొద్దిపాటి వర్షం కురిసినా నీరు నిలిచిపోయి స్థానికులు తీవ్ర ఇబ్బందుల పాలవుతున్నారు. బురదతో దుకాణాదారులు వ్యాపారాలు చేసుకోలేని పరిస్థితి. సంబంధిత అధికారులు స్పందించి నిర్మాణం పూర్తి చేయాలని స్థానికులు కోరుతున్నారు. సమస్యను పరిశీలించి తగిన విధంగా చర్యలు తీసుకుంటామని పురపాలిక ఇంజినీర్ వెంకన్న తెలిపారు.
- మిర్యాలగూడ, న్యూస్‌టుడే:

ప్రభుత్వ స్థలంలో వరినాట్ల తొలగింపు

స్పందనకు వందనం

మిర్యాలగూడ పట్టణం, న్యూస్‌టుడే: మిర్యాలగూడలోని చింతపల్లి బైపాస్ రహదారి సమీపంలో సర్వే సంఖ్య 626 లోని ప్రభుత్వ భూమిలో గుర్తు తెలియని వ్యక్తులు రాత్రికి రాత్రే వరినాట్లు వేశారు. దీనిపై ఈ నెల 25న 'రాత్రికి రాత్రే ప్రభుత్వ భూమిలో వరినాట్లు' శీర్షికతో 'ఈనాడు' కథనం ప్రచురించింది. కథనానికి స్పందించిన తహసీల్దారు హరిబాబు బుధవారం ఆ భూమిని పరిశీలించి.. ట్రాక్టర్‌తో వరినాట్లను తొలగించారు. ఎవరైనా ప్రభుత్వ భూమిని ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయన వెంట ఆర్ఐలు రామకృష్ణ, సత్యనారాయణ, ఒకటో పట్టణ పోలీస్ సిబ్బంది ఉన్నారు.



మిర్యాలగూడలోని ప్రభుత్వ స్థలంలో వరి నాట్లను ట్రాక్టర్‌తో చెరిపేస్తున్న తహసీల్దారు హరిబాబు, ఆర్ఐలు

పోలీసుల అదుపులో మరో ముగ్గురు..!

గుర్రంపోడు, న్యూస్‌టుడే: ముల్కలపల్లి రజిత మృతి కేసులో పోలీసులు మరో ముగ్గురిని అదుపులోకి తీసుకున్నట్లు తెలుస్తోంది. మృతురాలి భర్త ఇచ్చిన ఫిర్యాదులో ఉన్న ప్రధాన నిందితుడు రాములును పోలీసులు ఇది వరకే రిమాండుకు పంపిన విషయం తెలిసిందే. ఫిర్యాదులో నిందితుడి భార్య, ఆమెకు సహకరించినట్లుగా ఆరోపణలు ఉన్న ఆమె బంధువులైన ఇద్దరు యువకులను కూడా పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం.

పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జయంతి

దేవరకొండ, న్యూస్‌టుడే: పట్టణంలో భాజపా ఆధ్వర్యంలో బుధవారం పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జయంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూల



దేవరకొండలో దీన్‌దయాళ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న భాజపా శ్రేణులు

మాల వేసి నివాళులర్పించారు. భాజపా ఎస్సీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంకూరి నర్సింహ మాట్లాడుతూ.. అంత్యోదయ సిద్ధాంత రూపకర్త, ప్రభుత్వ పథకాలు ప్రతి ఒక్కరికీ చేరాలని కృషి చేసిన గొప్ప వ్యక్తిని కొనియాడారు. పట్టణ అధ్యక్షుడు అంజయ్య, వెంకటేష్, చండేశ్వర్, ఉప్పల వెంకటేష్, శంకర్, రవి, సైదులు తదితరులున్నారు.

నియంత్రిక.. పట్టించుకునే దిక్కులేక!

గుర్రంపోడు మండలం లక్ష్మీదేవిగూడెం శివారులో విద్యుత్తు నియంత్రికను దిమ్మె రాళ్లపై అమర్చారు. దీన్ని రైతులు వినియోగించుకుంటున్నారు. అసలే వర్షాకాలం వర్షానికి రాళ్లు పెకిలి నియంత్రిక పడిపోయే స్థితిలో ఉంది. సత్వరమే దిమ్మెను ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు.
– నల్గొండ, ఈనాడు; న్యూస్‌టుడే, గుర్రంపోడు



విద్యారంగంపై నిర్లక్ష్యం సరికాదు



మిర్యాలగూడలో ఎస్ఎఫ్ఐ రిలే దీక్షలను ప్రారంభిస్తున్న సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు మల్లేష్

మిర్యాలగూడ పట్టణం, న్యూస్‌టుడే: ఎన్నికల సమయంలో విద్యారంగాన్ని అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ పెద్దలు అధికారంలోకి వచ్చిన తర్వాత నిర్లక్ష్యం వహించడం సరికాదని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు డబ్బికార్ మల్లేష్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఖమ్మంపాటి శంకర్ అన్నారు. సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మిర్యాలగూడలోని సబ్ కలెక్టరేట్ సమీపంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలను ప్రారంభించి మాట్లాడారు. జగన్, సైదానాయక్, న్యూమన్, ప్రసన్న, దీపిక, నవదీప్, శ్రీకాంత్, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

దేవరకొండ: ప్రభుత్వ సంక్షేమ వసతిగృహాల్లోని సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని, పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్, కాస్మోటిక్ ఛార్జీలు పెంచాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు వలమాల ఆంజనేయులు కోరారు. ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో దేవరకొండ పట్టణంలోని సంక్షేమ వసతిగృహాలను సందర్శించి సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. శ్రీకాంత్, శివ, సందేశ్, ప్రేంకుమార్, నరేష్ తదితరులున్నారు.

కార్యాలయ ప్రాంగణం.. నీటిమయం!



గత వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు గుర్రంపోడు మండల కేంద్రంలోని తహసీల్దారు కార్యాలయ ప్రాంగణంలో చేరిన వర్షం నీటితో చెరువును తలపిస్తోంది. కార్యాలయానికి ధ్రువపత్రాల కోసం వచ్చే విద్యార్థులు నీటిలో కార్యాలయానికి రావాల్సిన పరిస్థితి ఏర్పడింది. కార్యాలయం పల్లంగా ఉండడంతో వరద నీరు అంతా కార్యాలయ ప్రాంగణంలోకి చేరి చెరువును తలపిస్తుంది. బుధవారం మధ్యాహ్నం 12 గంటల సమయంలో రోడ్డుకు ఓ పక్క అధికారులు గండి పెట్టారు.
– ఈనాడు, నల్గొండ; న్యూస్‌టుడే, గుర్రంపోడు

భక్తిశ్రద్ధలతో శ్రీఅనఘాష్టమి వ్రతాలు

మిర్యాలగూడ, న్యూస్‌టుడే: భాద్రపద బహుళ అష్టమి సందర్భంగా వైదేహిరామ్‌నగర్ శ్రీసాయిదత్త ఆశ్రమంలోని దత్తమందిరంలో బుధవారం శ్రీ అనఘాష్టమి వ్రతాలు సామూహికంగా భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ అధ్యక్షుడు గుండా శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి గుడుగుంట్ల నరేందర్ జ్యోతి వెలిగించి వ్రతాలు ప్రారంభించారు. గురుస్వామి జానకిరాముడు ఆధ్వర్యంలో ఈ వ్రతాలు జరిపారు. కార్యక్రమంలో మట్టయ్య, సోమన్న, జగన్నాధరావు, శ్రీనివాసబాబు, వెంకన్న, పద్మ, భాగ్యలక్ష్మి, కల్యాణి, భవాని పాల్గొన్నారు.



శ్రీసాయిదత్త ఆశ్రమంలోని దత్త మందిరంలో వ్రతాల్లో పాల్గొన్న భక్తులు

'డిండి' డీపీఆర్‌ను ఆమోదించాలి

డిండి, న్యూస్‌టుడే: దేవరకొండ, మునుగోడు నియోజకవర్గాలకు సాగు, తాగునీరందించే డిండి ఎత్తిపోతల పథకానికి డీపీఆర్‌ను వెంటనే ఆమోదించాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు నారి ఐటయ్య డిమాండ్ చేశారు. బుధవారం టి.గౌరారంలో సీపీఎం ఆరో మండల మహాసభకు హాజరై మాట్లాడారు. జిల్లా కమిటీ సభ్యుడు నల్లా వెంకటయ్య, వెంకటేశం, లక్ష్మణ్, పార్వతమ్మ, నరసింహ పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి

చింతపల్లి, న్యూస్‌టుడే: విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని మండల విద్యాధికారి నిరుడు అంజయ్య సూచించారు. బుధవారం మండలంలోని కుర్మేడ్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎస్‌జీఎఫ్ క్రీడ



కుర్మేడ్‌లో జ్యోతిని వెలిగిస్తున్న ఎంఈవో నిరుడు అంజయ్య

లను ప్రారంభించి మాట్లాడారు. కొండూరి పవన్‌కుమార్, జడ్పీటీసీ మాజీ సభ్యులు జటావత్ హరినాయక్, ఆర్.ఎస్.ప్రసాద్, ఎంపీటీసీ మాజీ సభ్యులు శ్రీశైలం, సింగిల్‌విండో డైరెక్టర్ అశోక్ పాల్గొన్నారు.

దసరా ఉత్సవాలు ప్రారంభం

మిర్యాలగూడ, న్యూస్‌టుడే: మిర్యాలగూడ ఎన్నెస్పీ క్యాంపులో ఏటా పట్టణ హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో నిర్వహించే సామూహిక దసరా ఉత్సవాలను జెండా ఆవిష్కరించి బుధవారం ప్రారంభించారు.




దసరా ఉత్సవాల జెండాను ఆవిష్కరిస్తున్న పట్టణ హిందూ ఉత్సవ సమితి ప్రతినిధులు

పట్టణ వాసులంతా ఒకచోట చేరి జమ్మి పూజ చేయటంతో పాటు రావణాసుర దహన కార్యక్రమాలు నిర్వహించేందుకు ఏర్పాటు చేస్తున్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే తిప్పన విజయసింహారెడ్డి, వేణు, చిట్టిబాబు, ఉపేందర్‌రెడ్డి, రమేష్, పురుషోత్తంరెడ్డి, ఉమాకర్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, శ్రీనివాస్, నవీన్, శ్యామ్ పాల్గొన్నారు.

సాయి దేవాలయంలో పూజలు

చింతపల్లి, న్యూస్‌టుడే: మండల కేంద్రంలోని శ్రీషిర్డీ సాయిబాబా దేవాలయంలో బుధవారం పీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు పింగలి శ్రీపాల్



చింతపల్లిలో పీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు పి.శ్రీపాల్‌రెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి సంఘం కృషి చేస్తుందన్నారు. మండల నాయకులు ఆయనను సన్మానించారు. జిల్లా అధ్యక్షుడు ఫణికుమార్, ప్రధాన కార్యదర్శి జానారెడ్డి, గౌరవ అధ్యక్షులు శ్రీనివాస్, మండల అధ్యక్షులు సుదీర్‌కుమార్ తదితరులున్నారు.

'ఒత్తిడితో ఉద్యోగం చేయలేం'



మిర్యాలగూడలో సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్‌కు వినతిపత్రం అందిస్తున్న పంచాయతీ కార్యదర్శులు

మిర్యాలగూడ పట్టణం, న్యూస్‌టుడే: గ్రామ పంచాయతీ ఎన్నికలు, గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణ, మొక్కల పెంపకం తదితర అంశాలపై చర్చించేందుకు బుధవారం మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్ ఆధ్వర్యంలో నిర్వహించ తలపెట్టిన సమావేశాన్ని పంచాయతీ కార్యదర్శులు బహిష్కరించారు. పలువురు కార్యదర్శులు మాట్లాడుతూ.. గత కొన్ని నెలలుగా వేతనాలు రాక అనేక ఇబ్బందులు పడుతున్న తమపై ఉన్నతాధికారులు ప్రవర్తిస్తున్న తీరుకు నిరసనగా సమావేశాన్ని బహిష్కరించామన్నారు. గ్రామాల్లో నిధులు లేక వివిధ పనుల కోసం కార్యదర్శులు అప్పులు చేయాల్సిన పరిస్థితి నెలకొందని వాపోయారు. అనంతరం తమ సమస్యలను సబ్ కలెక్టర్‌కు వివరించి వినతిపత్రం అందించాను. అంతకుముందు తమకు సామూహిక సెలవు మంజూరు చేయాలని కోరుతూ ఎంపీడీవో శేషగిరిశర్మకు వినతిపత్రం అందించారు. తహసీల్దారు హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

పెద్దవూర: గ్రామపంచాయతీల్లో నెలకొన్న ఆర్థిక సమస్యలు, పులిచర్ల పంచాయతీ కార్యదర్శిని సస్పెండ్ చేసినందుకు నిరసనగా సామూహిక సెలవులు పెడుతున్నట్లు పంచాయతీ కార్యదర్శుల మండల అధ్యక్షుడు విజయ్‌కుమార్ తెలిపారు. మండలంలో ఉన్న పంచాయతీ కార్యదర్శులు ఎంపీడీవోకు సామూహిక సెలవు పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పులిచర్ల పంచాయతీ కార్యదర్శి విధుల్లో భాగంగా మోటార్ కొనుగోలు కోసం నల్గొండకు వెళ్లారని, ఆ సమయంలో జిల్లా అధికారులు గ్రామాన్ని సందర్శించడంతో విధులకు గైర్హాజరయ్యారని సస్పెండ్ చేయడం సబబు కాదన్నారు. పంచాయతీ కార్యదర్శులు లక్ష్మి, పరమేష్, నాగిరెడ్డి తదితరులున్నారు.

త్రిపురారం: నల్గొండ జిల్లాలో ఇటీవల సస్పెండ్‌కు గురైన కార్యదర్శులను, విధుల్లోకి తీసుకోవాలని, పంచాయతీ కార్యదర్శులకు సామూహిక సెలవులను ఇవ్వాలంటూ ఎంపీడీవో విజయకుమారికి పంచాయతీ కార్యదర్శులు వినతిపత్రం అందజేశారు. రాజేందర్, జాఫర్, శ్రీనివాస్, ఉపేందర్, పల్లవి, రాధిక, జ్యోతి, అరుణ పాల్గొన్నారు.

కొండమల్లేపల్లి: సర్పంచుల పదవీ కాలం ముగిసినప్పటి నుంచి నిధుల కొరతతోపాటు పని ఒత్తిడితో ఉద్యోగం చేయలేకపోతున్నామని బుధవారం మండల పంచాయతీ కార్యదర్శుల సంఘం ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ఇటీవల జిల్లాలో సస్పెండ్ చేసిన కార్యదర్శులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని కోరుతూ ఎంపీడీవో రాంరెడ్డికి వినతిపత్రం అందజేశారు. డాకునాయక్, జైహిందర్, సరస్వతి, నర్సింహ, సత్యనారాయణ, ధరణి, నారాయణరెడ్డి, శిల్ప తదితరులున్నారు.

దేవరకొండ: పంచాయతీ కార్యదర్శుల సస్పెండ్‌కు నిరసనగా బుధవారం దేవరకొండ మండల పంచాయతీ కార్యదర్శులు ఎంపీడీవో నీలిమకు సామూహిక సెలవు పత్రాన్ని అందజేశారు. పంచాయతీ కార్యదర్శులున్నారు.

వేములపల్లి: అన్ని రకాల డిపార్ట్‌మెంట్‌లకు సంబంధించిన వంద రకాల పనులను సెక్రటరీలపై మోపడం సరికాదంటూ మండలంలోని పంచాయతీ కార్యదర్శులు సామూహిక సెలవులు పెడుతూ పనిభారంతో తాము విధులు నిర్వహించలేమంటూ ఎంపీడీవో శారదదేవికి వినతిపత్రాన్ని అందజేసి మాట్లాడారు. రాంరెడ్డి, శ్రవణ్, నాగరాజు, సామ్రాజ్యం, దివ్య, సబిత, సతీష్, శ్రవణ్ పాల్గొన్నారు.

పెద్దఅడిశర్లపల్లి: జిల్లాలో సస్పెండ్ చేసిన పంచాయతీ కార్యదర్శులను వెంటనే విధులలో చేర్చుకోవాలని కోరుతూ పీఏపల్లి మండల పంచాయతీ కార్యదర్శులు నిరసన వ్యక్తం చేశారు. సామూహిక సెలవు పెడుతూ స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో వినతి అందజేశారు.



దేవరకొండ ఎంపీడీవో నీలిమకు సామూహిక సెలవు పత్రం అందజేస్తున్న పంచాయతీ కార్యదర్శులు

నీట మునిగిన ఆశలు

పెద్దఅడిశర్లపల్లి, న్యూస్‌టుడే: పీఏపల్లి మండలంలో మంగళవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి అన్నదాతలు అతలాకుతలమయ్యారు. గంటల తరబడి ఎడతెరపిలేకుండా కురిసిన వానలకు పంటలు దెబ్బతిన్నాయి. పీఏ



పీఏపల్లిలో నీట మునిగిన బొప్పాయి తోట

పల్లిలో రైతులు ఆరుగాలం శ్రమించి పండించిన పంటల్లోకి పెద్దఎత్తున నీరు చేరింది. పీఏపల్లి గ్రామపంచాయతీ నీటమునిగింది. సమీప కాలనీలలోని రహదారులపై నీరు నిలిచి స్థానికులు ఇబ్బందులు పడ్డారు.

వర్షానికి కూలిన ఇల్లు

దేవరకొండ, న్యూస్‌టుడే: కొద్దిరోజులుగా కురుస్తున్న వర్షాలకు మండల పరిధిలోని తాటికోల్ గ్రామంలో బుధవారం తెల్లవారుజామున ఇల్లు కూలింది. ఆ సమయంలో ఎవరూ ఇంట్లో లేకపోవటంతో ప్రమాదం తప్పింది. వర్షానికి నాని ఇల్లు కూలిపోవడంతో బాధితుడు షేక్ దస్తగిరి ఆవేదన వ్యక్తం చేస్తూ.. తమకు ప్రభుత్వం నుంచి సాయం అందించాలని పంచాయతి కార్యదర్శికి వినతి చేశారు.

కారు పల్టీ.. పలువురికి గాయాలు

చందంపేట, న్యూస్‌టుడే: అదుపుతప్పి కారు పల్టీ కొట్టడంతో పలువురికి గాయాలైన ఘటన కాచరాజుపల్లి పుష్కరఘాట్ సమీపంలో బుధవారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. హైదరాబాద్‌కు చెందిన నలుగురు కారు అద్దెకు తీసుకొని వైజాక్‌కాలనీ కృష్ణా వెనక జలాలను వీక్షించేందుకు బయలుదేరారు. కాచరాజుపల్లి పుష్కరఘాట్ సమీపంలో అదుపుతప్పి బోల్తా కొట్టింది. ప్రమాదంలో కారులోని ఇద్దరు యువతులు, ఇద్దరు యువకులకు గాయాలయ్యాయి. ఈ విషయమై ఎస్సై సతీష్‌ను వివరణ కోరగా తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని, బాధితులు పేర్లు చెప్పడానికి నిరాకరించినట్లు తెలిపారు.



కాచరాజుపల్లి పుష్కరఘాట్ వద్ద ఘటన స్థలిలో కారు

సినిమాలు

మిర్యాలగూడ పట్టణం, న్యూస్‌టుడే

రాఘవ: కళింగ, **వెంకటేశ్వర:** సరిపోదా శనివారం, బొమ్మరిల్లు
విట్రోస్: సరిపోదా శనివారం, గోట్, భలే ఉన్నాడే, మత్తు వదలరా-2, ఏ.ఆర్.ఎం, **శ్రీనివాస:** మత్తు వదలరా - 2

అవీ ఇవీ

ఏబీవీపీ సభ్యత్వ నమోదు.. దేవరకొండ: పట్టణంలోని పలు ప్రభుత్వ కళాశాలల్లో బుధవారం ఏబీవీపీ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. రాష్ట్ర నాయకుడు యలమల గోపిచంద్ మాట్లాడుతూ.. ఏబీవీపీ 1949 జులై 9న కేవలం నలుగురు వ్యక్తులతో స్థాపితమై.. నేడు ప్రపంచంలోనే నెం.1 విద్యార్థి సంస్థగా నిలిచిందన్నారు. గణేష్, సంతోష్, సింహాద్రి, భార్గవి, వైష్ణవి, పరమేష్, పావని తదితరులున్నారు.

క్రీడలు ప్రారంభం.. పెద్దవూర: 68వ మండలస్థాయి పాఠశాల క్రీడలను పెద్దవూర మండలం పులిచర్ల ఉన్నత పాఠశాలలో బుధవారం మండల విద్యాధికారి తరి రాము ప్రారంభించారు. ఈ పోటీల్లో అండర్-14, 17 పాఠశాలల స్థాయి కబడ్డీ, వాలీబాల్ పోటీలు నిర్వహించి ప్రతిభ కనబర్చిన విద్యార్థులను జిల్లాస్థాయికి పంపుతున్నట్లు ఆయన తెలిపారు. తిరుమలగిరిసాగర్ మండల విద్యాధికారి కె.శ్రీనివాస్, ప్రధానోపాధ్యాయులు సత్యనారాయణ, సుదర్శన్, శివరాం తదితరులున్నారు.

హోంగార్డు అంతిమయాత్ర.. హాలియా: హాలియా పోలీస్‌స్టేషన్లో విధులు నిర్వహిస్తూ అనారోగ్యంతో మంగళవారం మృతి చెందిన హోంగార్డు వసంత్‌కుమార్ అంత్యక్రియలు బుధవారం జరిపారు. హాలియా ఎస్సై సతీష్‌రెడ్డి, పోలీస్ సిబ్బంది అంతిమయాత్రలో పాల్గొని పాడె మోసి నివాళి అర్పించారు. పట్టణ శ్మశానవాటికలో అంత్యక్రియలు నిర్వహించారు.



తనిఖీ.. మిర్యాలగూడ గ్రామీణం: పురుగు మందులు, ఎరువుల దుకాణదారులు లైసెన్స్‌లు, పీసీల ఇన్‌క్లూజన్స్, స్టాక్ రిజిస్టర్ నిర్వాహణ, బిల్లు పుస్తకాలు సరిగ్గా నిర్వహించాలని లేకపోతే శాఖపరమైన చర్యలు తీసుకుంటామని సహాయ వ్యవసాయ సంచాలకులు దేవ్‌సింగ్ హెచ్చరించారు. మిర్యాలగూడ మండల కేంద్రంలోని పలు నీలిమందుల, ఎరువులను దుకాణాల్లో ఆయన మండల వ్యవసాయాధికారి సైదానాయక్‌తో కలసి బుధవారం తనిఖీలు నిర్వహించారు.

అభివృద్ధే ధ్యేయం.. మాడ్గులపల్లి: గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు గడ్డం వేణుగోపాల్‌రెడ్డి అన్నారు. మాడ్గులపల్లిలో మాట్లాడుతూ పుచ్చకాయలగూడెం నుంచి మాడ్గులపల్లికి వెళ్లే దారిని ఆగామోత్కూర్‌కు అనుసంధానం చేసే విధంగా, తోపుచర్ల నుంచి సల్కునూరు గ్రామాలకు వెళ్లే దారుల నిర్మాణం కోసం మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, సీతక్కలకు ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు.

సత్కారం.. మిర్యాలగూడ పట్టణం: ఐసీడీఎస్ మిర్యాలగూడ అర్బన్ ప్రాజెక్టు పరిధిలోని 96 అంగన్‌వాడీ కేంద్రాలలో ఉత్తమ ఉపాధ్యాయినిగా బహుమతి సాధించిన పట్టణంలోని హనుమాన్‌పేట కేంద్రం ఉపాధ్యాయిని నేమాని సుజాతను స్థానిక కౌన్సిలర్ చిలుకూరి రమాదేవి ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో భాజపా నాయకుడు చిలుకూరి శ్యామ్, తిరుమలేశ్వరి, మంగ, నవ్య పాల్గొన్నారు.

నియామకం.. కొండమల్లేపల్లి: పీఆర్‌టీయూ జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడిగా మండల కేంద్రానికి చెందిన **వాసికార్ల రమేష్** నియమితులయ్యారు. ఈ మేరకు బుధవారం సంఘం జిల్లా కమిటీ నుంచి తనకు ఉత్తర్వులు అందినట్లు రమేష్ తెలిపారు.



అజ్మాపురంలో ఉచిత మెగా వైద్య శిబిరం.. పెద్దఅడిశర్లపల్లి: మండలంలోని అజ్మాపురంలో లయన్స్ క్లబ్ దేవరకొండ వారి ఆధ్వర్యంలో వస్కుల ముత్యాలు జ్ఞాపకార్థం ఆయన మనుమరాలు ధృతి మహిశ్రీ జన్మదినం సందర్భంగా బుధవారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో 350 మందికి ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. లయన్స్ క్లబ్ అధ్యక్షుడు వస్కుల సత్యనారాయణ, జోనల్ ఛైర్మన్ వనం భిక్షమయ్య, సముద్రాల ప్రభాకర్, నిరంజన్, బుచ్చయ్య, లక్ష్మణ్, జంగయ్య, రాజేష్, మల్లయ్య, రుక్మారెడ్డి, ఆదిరాల నగేష్, ఇరగదిండ్ల రామకృష్ణ, వి.కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

భారీగా తరలిరావాలి

కొండమల్లేపల్లి, న్యూస్‌టుడే: తెలుగు విశ్వవిద్యాలయానికి అమరజీవి పొట్టి శ్రీరాములు పేరును యథావిధిగా ఉంచాలని కోరుతూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు గురువారం కలెక్టర్‌కు వినతి పత్రాన్ని అందజేయనున్నట్లు, ఈ కార్యక్రమానికి ఆర్యవైశ్యులు భారీగా తరలిరావాలని ఆ సంఘం మండల గౌరవాధ్యక్షుడు జిన్నం రాంమూర్తి కోరారు. బుధవారం మండల కేంద్రంలో జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సంఘం మండలాధ్యక్షుడు జనార్ధన్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, కోశాధికారి కరుణాకర్, పట్టణాధ్యక్షుడు ధనయ్య, ప్రధాన కార్యదర్శి నరేందర్, కోశాధికారి శ్రీనివాస్ తదితరులున్నారు.

28న లోక్ అదాలత్

మిర్యాలగూడ లీగల్: రాజీ మార్గం ద్వారా కేసులను సత్వరమే పరిష్కరించి.. కక్షిదారులకు సత్వర న్యాయం అందించేందుకు ఈనెల 28న మిర్యాలగూడలోని కోర్టు ఆవరణలో లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు మండల న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షుడు, ఐదో అదనపు జిల్లా న్యాయమూర్తి జి.వేణు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.